

PRGI Regd. No : APTEL/26/A0819

నేటిపత్రిక

# ప్రజాసీమ

జాతీయ తెలుగుదినపత్రిక



## విలేకరులు కావలెను.

నిజాన్ని నిర్భయంగా ప్రచురిస్తూ పత్రికా రంగంలో కొత్త ఒరవడిని సృష్టిస్తున్న నేటి దినపత్రిక ప్రజాసీమ పత్రికలో పనిచేసేందుకు నియోజకవర్గ ఇన్‌చార్జులు, మండల విలేకరులు కావలెను

సంప్రదించవలసిన నెంబర్లు

8074596109, 9676747256



ప్రచురణ : వైయస్ఆర్ కడప జిల్లా | సంపుటి : 01 | సంచిక: 29 | ఆదివారం 3, మే 2026 | పేజీలు : 08 | వెల: 02

Circulated At YSR Kadapa, Annamayya, Vijayawada, Tirupathi, Chittor, Kurnool, Nandyal, Ananthapur, Puttaparthi, SPSR Nellore, VIshakapatnam, East Godavari, West Godavari




మంత్రి లోకేశ్ పనితీరు

# చాలా బాగుంది

## వెంకయ్యనాయుడు ప్రశంసలు

నెల్లూరు, మే 2 : ఏపీ విద్యశాఖ మంత్రి నారా లోకేశ్ పనితీరు చాలా బాగుందని భారత పూర్వ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు ప్రశంసించారు. ఈ ఏడాది పదోతరగతిలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు మంచి ఫలితాలు తీసుకువచ్చారని కొనియాడారు. మాజీ ప్రధాని వాజ్‌పాయ్, ప్రధానమంత్రి నరేంద్రమోదీ హయాంలో నాలుగుసార్లు కేంద్రమంత్రిగా, ఉపరాష్ట్రపతి పదవులు స్వీకరించానని ప్రస్తావించారు. తన కుమారుడు హర్షవర్ధన్, కుమార్తె దీపా వెంకట్‌లతో... వారి వ్యాపారాల్లో తాను కలగజేసుకోనని, తన రాజకీయాల్లోకి వారు రావొద్దనే గౌరవ ఒప్పందం చేసుకున్నామని తెలిపారు. మంచి పనులు చేసే వారిని ప్రతి ఒక్కరూ ప్రోత్సాహించాలని వెంకయ్యనాయుడు సూచించారు.

తల్లిదండ్రులు పిల్లలకు సమయాన్ని కేటాయించట్లేదు..

ఈరోజు (శనివారం) నెల్లూరు జిల్లా వెంకటాచలం మండలం గొలగమూడిలో ఆయన పర్యటించారు. శ్రీ భగవాన్ వెంకయ్యస్వామి జీవిత చరిత్ర, విశ్వంభరుడు పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సర్వేపల్లి

2 లో

మాజీ స్పీకర్

# కోడెల జయంతి

## నివాళులర్పించిన చంద్రబాబు

- రూపాయి వైద్యుడిగా పేదలకు కోడెల సేవ చేశారన్న చంద్రబాబు
- రాజకీయాల్లో సైతం తనదైన ముద్ర వేశారని కితాబు
- కోడెల లాంటి నాయకుడి సేవలు మరువలేనివని వ్యాఖ్య

ఆంధ్రప్రదేశ్ మాజీ శాసనసభాపతి, దివంగత నేత డాక్టర్ కోడెల శివప్రసాదరావు జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు ఆయనకు ఘనంగా నివాళులర్పించారు.

ఈ సందర్భంగా కోడెల సేవలను స్మరించుకుంటూ సీఎం ఎక్స్ వేదికగా



భావోద్వేగపూరిత పోస్ట్ చేశారు. వృత్తిరీత్యా వైద్యుడైన కోడెల, పేద ప్రజల పట్ల ఎంతో కనికరం చూపిస్తూ 'రూపాయి వైద్యుడి'గా సేవలందించి వారి హృదయాల్లో చెరగని ముద్ర వేశారని చంద్రబాబు కొనియా డారు. కేవలం వైద్యుడిగానే కాకుండా, రాజకీయాల్లోనూ తనదైన ముద్ర వేసిన కోడెల... సంఘవిద్రోహ శక్తులు, ఫ్యాక్షనిస్టులకు భయపడకుండా ధైర్యంగా ఎదురొడ్డి నిలిచిన ధీశాలి అని గుర్తు చేసుకున్నారు. పల్నాడు ప్రాంత అభివృద్ధికి ఆయన చేసిన కృషిని, ఆయనకున్న దూర దృష్టిని ప్రశంసిస్తూ... కోడెల శివప్రసాద రావు లాంటి నాయకుడి సేవలు మరువలేని వని సీఎం తన సందేశంలో పేర్కొన్నారు.



అమరావతి అభివృద్ధిలో మరో

# ముందడుగు

## క్వాంటం వ్యాలీలో ట్విన్ టవర్లకు గ్రీన్ సిగ్నల్

అమరావతి, మే 2 : ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి అభివృద్ధిలో భాగంగా ఏపీ ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. రాజధాని ప్రాంతంలోని క్వాంటం వ్యాలీలో అత్యాధునిక సౌకర్యాలతో నిర్మించతలపెట్టిన ట్విన్ ఆఫీస్ టవర్ల నిర్మాణానికి అధికారికంగా పరిపాలన అనుమతులు లభించాయి. రాజధాని నగరంలో మౌలిక సదుపాయాల కల్పన, పరిపాలనా యంత్రాంగానికి అవసరమైన కార్యాలయాల కోసం ఈ ట్విన్ టవర్లను ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతోంది. ట్విన్ టవర్ల 'షెల్ అండ్ కోర్' నిర్మాణ పనుల కోసం రూ. 1208.41 కోట్లు కేటాయిస్తూ మున్సిపల్ పరిపాలన శాఖ

మిగతా 2వ పేజీలో..

# విజయవాడ రైల్వే స్టేషన్‌లో

# వసూళ్ళ పర్వం






## - టీసీలు, సీటీఐల పేరిట దందా - రైల్వే ప్రతిష్టకు మచ్చతెస్తున్న అసాంఘిక కార్యకలాపాలు - లోతుగా వెళ్తే షాకింగ్ నిజాలు

ఏపీ బ్యూరో, (ప్రజా సీమ) విజయవాడ రైల్వే స్టేషన్... దేశంలో అత్యంత రద్దీగా ఉండే ప్రధాన జంక్షన్లలో ఒకటి. రోజూ వేలాది మంది ప్రయాణికులు ఇక్కడి నుంచి ప్రయాణిస్తారు. కానీ అదే స్టేషన్ ఇప్పుడు కొంతమంది ఉద్యోగుల చేతుల్లో 'అక్రమాల కేంద్రం'గా మారిపోయిందనే ఆరోపణలు వెలుగులోకి రావడం కలకలం రేపుతోంది. విధి నిర్వహణ పేరుతో అధికార దుర్వినియోగం, ప్రయాణికులపై దాడులు, లంచాల వసూళ్లు, నకిలీ సర్టిఫికెట్లు, కోట్ల రూపాయల ఆస్తుల గుట్టు ఇవన్నీ కలిపి ఒక పెద్ద అవినీతి వలయాన్ని సూచిస్తున్నాయి. ఈ వ్యవహారం ఒక్కొక్కటి బయటపడుతున్న కొద్దీ రైల్వే వ్యవస్థలో ఉన్న లోపాలు ఎంత లోతుగా ఉన్నాయో అర్థమవుతోంది.

### అవినీతి పంథాలో దూసుకెళ్తున్న మహిళా ఉద్యోగి

విజయవాడ రైల్వేస్టేషన్ దుస్థితికి కారణమైన ముగ్గురు ముఠా సభ్యుల్లో ఒక మహిళ కూడా ఉండటం, ఆమే మరీ శృతి మించి వసూళ్లు చేస్తుండటం తీవ్ర వివాదాస్పదంగా మారింది. స్పోర్ట్స్ కోటా కింద ఉద్యోగంలోకి వచ్చిన ఈమె సమర్పించిన సర్టిఫికెట్లు కూడా నకిలీవేననే ఆరోపణలున్నాయి. అంతకుమించిన తప్పులు కూడా అనేకం ఉన్నాయని రైల్వే సిబ్బంది చెబుతున్నారు. క్లాస్ ఫోర్ స్థాయి ఉద్యోగం నుంచి నిబంధనలకు విరుద్ధంగా భారీ మొత్తాలు ఖర్చు చేసి మ్యూచువల్ ట్రాన్స్‌ఫర్ పొందడం, టీసీ పరీక్షల్లో విఫలమైనప్పటికీ ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్ స్థాయిలో 'మేనేజ్‌మెంట్' ద్వారా పాస్ కావడం వంటి అంశాలు వ్యవస్థలోని బలహీనతలను బయటపెడుతున్నాయి. మరో ముఖ్యమైన విషయం ఏమిటంటే ప్రయాణికులతో ఆమె ప్రవర్తన మరింత ఆందోళనకరంగా ఉండటం. స్టేషన్ లోపల విధి నిర్వహణ చేయాల్సిన ఆమె బయట రోడ్డుపై నిలబడి భాష తెలియని వలస కార్మికులను టార్గెట్ చేయడం, చలానాల పేరుతో అధికంగా డబ్బులు వసూలు చేయడం, ప్రశ్నిస్తే దుర్భాషలాడడం చేస్తోంది. ఇవి కేవలం సేవా లోపాలు కాదు, నేరప్రవర్తనకు దగ్గరగా ఉన్న చర్యలుగా విమర్శలు వస్తున్నాయి.

### బ్యాక్ బోన్ భాయ్!

ఇక ఈ వ్యవహారానికి 'బ్యాక్‌బోన్'గా చెప్పబడుతున్న మరో వ్యక్తి సాధారణ ఉద్యోగిగా చేరి కోట్ల రూపాయల ఆస్తులు సంపాదించాడనే ఆరోపణలు తీవ్రమైన సందేహాలను కలిగిస్తున్నాయి. వించిపేటలో డజన్ల కొద్దీ ఇళ్లు, భారీ అద్దె ఆదాయం, పై అధికారులకు మామూళ్లు ఇస్తున్నానని చెప్పుకోవడం ఇవన్నీ ఒక వ్యవస్థీకృత అవినీతి నెట్వర్క్‌ను సూచిస్తున్నాయి. కొత్తగా చేరిన టీసీలకు విధి నిర్వహణ నేర్పాల్సిన వ్యక్తి, లంచాలు ఎలా వసూలు చేయాలో 'ట్రైనింగ్' ఇస్తున్నాడనే ఆరోపణ మరింత షాకింగ్. అంటే అవినీతి వ్యక్తిగత స్థాయిని దాటి ఒక సంస్థాగత రూపం దాల్చిందన్నమాట. గతంలో ఇతనిపై నమోదైన క్రమశిక్షణ చర్యలు కూడా పెద్దగా ప్రభావం చూపకపోవడం, అధికార వ్యవస్థలో 'మేనేజ్‌మెంట్ కల్చర్' ఎంత బలంగా ఉందో చూపిస్తోంది.

### పదేళ్లుగా దండుకుంటూనే ఉన్నాడు

మూడో వ్యక్తి వ్యవహారం కూడా అంతే వివాదాస్పదం. పదేళ్లుగా ఒకే స్టేషన్‌లో కొనసాగుతూ విధులకు గైర్హాజరు అవుతున్నాడనే ఆరోపణలు, నైట్ డ్యూటీలు తప్పించుకోవడం, స్టేషన్ సౌకర్యాలను వ్యక్తిగత అవసరాలకు వాడుకోవడం వంటి అంశాలు క్రమశిక్షణను పూర్తిగా దెబ్బతీస్తున్నాయి. రిటైరింగ్ రూమ్స్ వంటి సౌకర్యాలను అసాంఘిక కార్యకలాపాలకు ఉపయోగిస్తున్నారనే ఆరోపణలు రైల్వే ప్రతిష్టకు పెద్ద మచ్చగా మారుతున్నాయి.

### సర్వీస్ రిజిష్టర్లు చూస్తే చాలు

ఒకరు వసూళ్లు చేస్తే ఇంకొకరు వాటాలను పంచుకుంటారు. మరొకరు అండగా నిలుస్తారు.

2 లో

నేటిపత్రిక
PRGI Regd. No : APTEL/26/A0819
ప్రజాసీమ
జాతీయ తెలుగు దినపత్రిక


# సంపాదకీయం

## ప్రభుత్వాల్లో లోపించిన ఆర్థిక క్రమశిక్షణ !

తెలుగు రాష్ట్రాల్లో ఆర్థిక పరిస్థితి దారుణంగా ఉంది. ఉద్యోగుల బకాయిలను చెల్లించలేని దుస్థితిలో తెలంగాణ ప్రభుత్వం ఉంది. ఎపిలో కిందామీదా పడి కేంద్రం నుంచి కొన్ని గ్రాంటలు తెచ్చుకుని సర్దుకుంటున్నారు. ఎన్‌డిఎలో చంద్రబాబు కీలకం కావడంతో ఇప్పుడు కేంద్రం ఆయన పాదాక్రాంతం అవుతోంది. చంద్రబాబును కేంద్రమంత్రులు పొగిడేస్తున్నారు. పథకాలకు సంబంధించి నిధులను ఆగమేఘాల మీద విడుదల చేస్తున్నారు. అయినా ఆర్థిక క్రమశిక్షణ ఇరు రాష్ట్రాల్లో కనిపించడం లేదు. తెలంగాణ ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క లెక్కలు సరిగా వేయడం లేదు. దుబారా ఖర్చులకు విదల్చడం తప్ప, అసలు వ్యవహారాల్లో పెద్దగా పట్టించుకోవడం లేదు. పెన్షనర్లు, ఉద్యోగులకే 8వేల కోట్ల బకాయలు ఉన్నాయంటే ఎంత దౌర్భాగ్యంగా ప్రభుత్వం నడుస్తుందో చెప్పవచ్చు. ఈ మధ్యే వేయికోట్లు విడుదల చేశారు. ఇకనుంచి నెలనెలా వేయికోట్లు విడుదల చేస్తామని సిఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. అయితే ఉద్యోగులకు వారికి చెల్లించాల్సిన మొత్తాలను చెల్లించకుండా పోవడం దారుణం. అది గత కెసిఆర్ ప్రభుత్వమైనా, ఇప్పుడున్న రేవంత్ ప్రభుత్వమైనా వైఫల్యంగానే చూడాలి. జీతాలు 1వ తారీఖున వేస్తున్నామని గొప్పలు చెప్పుకోవడం మరింత అసమర్థతగా చూడాలి. దుబారా ఖర్చులు, దుబారా పథకాలు, హెలికాప్టర్ తిరుగుళ్లు మాత్రం ఆగడం లేదు. అందుకే ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల విషయంలో ప్రస్తుత తెలంగాణ ప్రభుత్వం రెండున్నరేళ్లుగా నాన్చివేత ధోరణి కొనసాగించింది. ఆర్థికంగా భారం పడని సమస్యలు కూడా పరిష్కారానికి నోచుకోకపోవడంతో ఉద్యోగుల్లో అసంతృప్తి పేరుకుపోతోంది. ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం జిల్లాల్లో కలెక్టర్లు, రాష్ట్ర స్థాయిలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సమావేశమై ఎప్పటికప్పుడు సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాల్సి ఉండగా వారూ పట్టించుకోవడం లేదు. ప్రభుత్వ యంత్రాంగంలో జవాబుదారీతనం లోపించడంవల్ల ఇలా జరుగుతోందని అనుకోవాలి. అధికార యంత్రాంగంలో బాధ్యతా రాహిత్యం వారసత్వంగా కొనసాగుతోంది. ఇకపోతే ఉద్యోగులు కూడా లంచాలకు మరిగారు. చిన్నపనికి కూడా లంచం లేనిదే ఫైలు ముట్టడం లేదు. అంతెందుకు మాట్లాడడం లేదు. పంచాయితీల్లో వేయి తడపనిదే మాట్లాడడం లేదంటే అవినీతి ఎంతగా పెరిగిందో చూడవచ్చు. జిల్లాలు పెరిగితే కలెక్టర్లకు పనులు సులువవుతాయని అనుకున్నారు. కానీ అసలు కలెక్టర్లు తమ క్షేత్ర పరిధిలో పర్యవేక్షించడం మానేశారు. గ్రామస్థాయిలో ఉద్యోగులపై అజమాయిషీ కనిపించడం లేదు. ఫలితంగా సమస్యలు పేరుకుపోవడమే కాకుండా కొత్త సమస్యలు తరుముకు వస్తున్నాయి. దీనికితోడు మంత్రుల్లో కూడా బాధ్యత కనిపించడం లేదు. ఎవరు కూడా సమస్యను పరిష్కరించాలన్న చొరవ చూపడం లేదు. ఆర్థికమంత్రి భట్టి చొరవ చూపి ఉంటే ఉద్యోగుల బకాయిలు ఇలా పేరుకు పోయేవి కావు. ఎంతసేపు ఆరు గ్యారెంటీలను అమలు చేశాం..మాది ప్రజాప్రభుత్వం అంటూ పోజులు ఇవ్వడం తప్ప ఏమీ చేయడం లేదు. అంతెందుకు జర్నలిస్టుల అక్రిడేషన్ల సమస్యకూడా రెండున్నరేళ్లు అయినా సక్రమంగా పరిష్కరించలేకపోయరు. అసమర్థ మంత్రులు, అధికారుల వల్లనే పరిస్థితి మరింత అయోమయంగా మారింది. పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలు కొండల్లా పేరుకుపోతున్నా, రెండున్నరేళ్లుగా డిప్యూటి సిఎం భట్టి నోరు మెదపలేదు. ఆర్థికశాఖ చూస్తున్న ఆయన దీనిపై దృష్టి పెట్టలేదు. బకాయిలు అందక పలువురు పెన్షనర్లు న్యాయస్థానం తలుపు తట్టడం, ప్రభుత్వానికి కోర్టు అక్షింతలు వేయడం జరిగినా తక్షణంగా సమస్యను పరిష్కరించలేక పోయారు. అందుకు కారణం లేకపోలేదు. ఉన్న డబ్బులు పందేరాలకు సరిపోతోంది. కొత్త పథకాలతో ప్రజలను బురిడీ కొట్టించేందుకు తయారవుతున్నారు. కమీషన్ల లేనిదే బిల్లులు పాస్ కావడం లేదని లోకం కోడై కూస్తున్నా మేల్కోవడం లేదు. నిజానికి పెన్షన్లు ఆపడం, బకాయిలు చెల్లించకపోవడం అన్నది కెసిఆర్ హయాంలోనే పెద్ద ఎత్తున జరిగింది. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం అదే అమలు చేయడంతో బకాయిలు కొండల్లా పేరుకు పోయాయి. బకాయిల చెల్లింపు అనేది ప్రభుత్వం బాధ్యత. నిధుల కొరత అని ఈ బాధ్యత నుంచి తప్పించుకోలేరు. తెలంగాణ ప్రభుత్వమే కాదు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా ఆర్థిక సంక్షోభంలోనే ఉంది. మిగతా రాష్ట్రాలు కూడా ఈ జాబితాలో చేరబోతున్నాయి. ఇందుకు ఉచిత పథకాలు తెల్ల ఏనుగుల్లా సవారీ చేస్తున్నాయని గుర్తించడం లేదు. ప్రభుత్వాలు అప్పుల ఊబిలో కూరుకుపోవడానికి రాజకీయ పార్టీల ఉచిత పథకాల తీరే కారణం. ఇందులో ఎటువంటి మొహమాటం అక్కర్లేదు. వివిధ స్థాయిలలో నిర్లక్ష్యం ప్రవేశించడంతో జవాబుదారీ తనం లోపించింది. సమస్య ఏదైనా దాన్ని పరిష్కరించాల్సిన బాధ్యత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిదే. ఆయన కిందిస్థాయిలో ఏం జరుగుతందో తెలుసుకోవడం లేదు. ప్రభుత్వంపై పట్టు సాధించలేక పోతున్నారు. దీనికితోడు కాంగ్రెస్‌లో సొంత నిర్ణయాలు తీసుకునే వెసలుబాటు ఉండదు. మొత్తంగా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం సమస్యల ఊబిలో చిక్కుకుపోతోంది. ఆర్థిక కష్టాలు ప్రభుత్వాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. అలవిగాని హామీల అమలుకు ప్రయత్నించి, అది సాధ్యం కాక ప్రభుత్వం చతికిలపడుతోంది. రైతుబంధు వంటి పథకాన్ని కూడా విడతల వారీగా అమలు చేయాల్సిన దుస్తితి కొనితెచ్చుకున్నారు. అప్పులు చేయడం, వడ్డీలకు చెల్లించడం నిత్యకృత్యంగా మారింది. పదవీ విరమణ చేసిన ఉద్యోగులకే ఎనిమిది వేల కోట్లకు పైగా చెల్లించాల్సి ఉందంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. బిల్లుల చెల్లింపులో ప్రాధాన్యాలు పాటించకపోవడం,రాజకీయ పలుకుబడిని బట్టి చెల్లింపులు చేయడం వల్ల వివిధ వర్గాల ప్రజల్లో అసంతృప్తి నెలకొంటోంది. చిన్నచిన్న సమస్యలను కూడా పరిష్కరించలేకుండా, అభివృద్ధి పనులు చేయకుండా మళ్లీ అధికారంలోకి వస్తామని హుంకరిస్తే..ప్రజలు ఆదరించాలని గుర్తించాలి. అధికారం అన్నది ప్రజల దయాదాక్షిణ్యాల మీద ఆధారపడి ఉందని గుర్తించి మసలుకుంటే మంచిది.

# గ్లోబల్ శాంతిలో మీడియా పాత్ర

**- జ్ఞాన్ సరోవర్‌లో జాతీయ మీడియా సమావేశం**





అబు రాజ్, మే 02 :మౌంట్ అబూలోని బ్రహ్మ కుమారీల జ్ఞాన్ సరోవర్ క్యాంపస్‌లోని ప్రశాంత వాతావరణంలో, ఐదు రోజుల ముఖ్యమైన జాతీయ మీడియా కాన్ఫరెన్స్ లోతైన ప్రతిబింబ రిసెప్షన్ సెషన్‌తో ప్రారంభించారు. హార్మొనీ హాల్‌లో హోస్ట్ చేయబడి, బ్రహ్మ కుమారీస్ మీడియా వింగ్ నిర్వహించే సమయానుకూల కార్యక్రమం, దేశవ్యాప్తంగా ఉన్న 1,000 మంది ప్రముఖ మీడియా నిపుణులు, జర్నలిస్టులు కంటెంట్ సృష్టికర్తలను ఒకచోట చేర్చి కీలకమైన ఇతివృత్తం: "ప్రపంచ శాంతి అవసరం – మీడియా పాత్ర". , సిస్ సమన్వయం. బి.కె. చందా, ఆధ్యాత్మిక గాయకుడు బ్రో చేత ఉత్తేజకరమైన స్వాగత గీతంతో ప్రారంభమైంది. బి.కె. యుగ్రతన్, ఆగ్రాకు చెందిన కాజోల్ డ్యాన్స్ అకాడమీ ప్రదర్శించిన ఉత్సాహభరితమైన స్వాగత నృత్యం. బ్రో. బి.కె. ముంబైలోని ఆర్ ఇ ఆర్ ఎఫ్ మీడియా వింగ్ నేషనల్ కోఆర్డినేటర్ నికుంజ్ హాజరై వారికి లాంఛనంగా స్వాగతం పలికారు. ప్రేక్షకులను కట్టిపడేస్తూ, మీడియా ప్రపంచానికి శాంతిని కలిగిస్తుందని వారు నమ్ముతున్నారా అని అడిగారు. "అవును" అనే ప్రతిధ్వనిని అనుసరించి, ప్రపంచ సామరస్యాన్ని పెంపొందించడంలో ప్రతి వ్యక్తి యొక్క గాఢమైన వ్యక్తిగత బాధ్యతను నొక్కి చెబుతూ, "నేను మీడియాను" అని ప్రతినిధులకు గుర్తు చేశారు. అగ్నిమాపక దళం యొక్క సారూప్యతను ఉపయోగించి, శాంతి రాహిత్యపు జ్వాలలను ఆర్పడానికి మీడియా వారి శీతల్ శక్తి (శీతలీకరణ శక్తి)ని ఉపయోగించాలని ఆయన కోరారు. ఒక నిప్పురవ్వ యుద్ధాన్ని ప్రారంభించగలిగితే, ఒక స్పార్క్ కూడా శాంతిని రగిలించే సామర్థ్యాన్ని కలిగి ఉంటుందని ఆయన పేర్కొన్నారు. "నేను ప్రపంచంలో శాంతిని నెలకొల్పుతాను" అని ప్రతిజ్ఞ చేయమని ప్రతి ఒక్కరినీ ఆహ్వానిస్తూ, సూరజ్ రే తు జల్తే రెహ్నా యొక్క ప్రదర్శనలో సభకు నాయకత్వం వహించడం ద్వారా అతను తన ప్రసంగాన్ని ముగించాడు. సమావేశానికి స్ఫూర్తిని అందిస్తూ, సిస్. బి.కె. హైదరాబాద్‌లోని ఆర్‌ఈఆర్‌ఎఫ్ మీడియా వింగ్ వైస్ చైర్‌పర్సన్ సరళ మాట్లాడుతూ.. దేవుడి ఆహ్వానం మేరకే తాము తరలివచ్చామని ప్రతినిధులకు గుర్తు చేశారు. వారి ప్లాట్‌ఫారమ్‌ల పరిధిని హైలైట్ చేస్తూ, ప్రజలు అనేక సమస్యలను ఎదుర్కొంటుండగా, దేవునికి పరిష్కారాలు ఉన్నాయని, ఆ పరిష్కారాలు తన పిల్లలకు ప్రతిచోటా చేరేలా చూడాలని ఆయన మీడియాపై ఆధారపడుతున్నారని ఆమె పేర్కొంది. కేవలం మీడియా నిపుణులుగానే కాకుండా, దేవుని ప్రతినిధులుగా కూడా సదస్సుకు బయలుదేరాలని నిపుణులకు ఆమె విజ్ఞప్తి చేశారు. వ్యక్తిగత జ్ఞానోదయమే కాన్ఫరెన్స్ యొక్క ప్రధాన లక్ష్యం అని నొక్కి చెబుతూ, వివిధ సామాజిక రంగాలలో ప్రత్యక్షమైన పరిష్కారాలను అందించడానికి అంకితమైన బ్రహ్మ కుమారీల 25 రెక్కల యొక్క స్థూలదృష్టిని ఆమె అందించింది. రాజయోగిని బి.కె. ప్రభా దీదీ, జ్ఞాన్ సరోవర్ డైరెక్టర్, అబు రాజ్, సభకు ఆమె ఆశీస్సులు అందించారు. ఆమె 90 సంవత్సరాల క్రితం దేవుని ప్రార్థనను ప్రతిబింబించింది, మీడియా నుండి అతని పిల్లలు ప్రపంచానికి ఆయన సందేశాన్ని తీసుకెళ్లే రోజును ఊహించారు. శాంతి అనేది ఆత్మ యొక్క స్వాభావిక స్వభావమని నొక్కిచెప్పిన ఆమె, ఈ ఆధ్యాత్మిక సత్యాన్ని మరచిపోవటం నుండి శాంతి రాహిత్యము పుడుతుందని పేర్కొంది. , సముద్రంలో మునిగి ముత్యాలను పండించినట్లే, ఆధ్యాత్మిక జ్ఞానాన్ని పరిశోధించడం వల్ల విలువైన జ్ఞాన రత్నాలు లభిస్తాయని వాగ్దానం చేసింది. బ్రో. బి.కె. శంతను, నేషనల్ కోఆర్డినేటర్, మీడియా వింగ్, అబు రాజ్, రాబోయే కాన్ఫరెన్స్ సెషన్‌ల యొక్క సమగ్ర అవలోకనాన్ని అందించారు, ప్లీనరీలు, అంతర్దృష్టి సెషన్‌లు వన్–టు–వన్ చర్చల డైనమిక్ మిక్స్‌ను వాగ్దానం చేశారు. డా. బి.కె నేతృత్వంలో ప్రపంచ శాంతి కోసం శక్తివంతమైన గైడెడ్ మెడిటేషన్ అనుభవంతో స్ఫూర్తిదాయకమైన రిసెప్షన్ ముగిసింది. బిన్నీ, పి ఆర్ ఆధ్యాత్మిక సలహాదారు, జి హెచ్ ఆర్ సి , అబు రాజ్, హాజరైన వారందరికీ భగవంతుని బహుమతులు, ప్రసాదాల పంపిణీని చేశారు .

## ఘనంగా వీరజవాన్ లాన్స్ నాయక్ సాయితేజ విగ్రహావిష్కరణ

**- హాజరైన టిడిపి బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు పి.సురేంద్ర యాదవ్**

**- ఆయన స్ఫూర్తితో యువత దేశ సేవకు సిద్ధం కావాలని పిలుపు**





మదనపల్లె (ప్రజా సీమ) : అన్నమయ్య జిల్లా,తంబళ్లపల్లి నియోజకవర్గం, కురబలకోట మండలం,ఎగువరేగడకు చెందిన వీర జవాన్ లాన్స్ నాయక్ సాయి తేజ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం శుక్రవారం విశ్వం కళాశాల సమీపంలో అట్టహాసంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన టిడిపి బీసీ సెల్ అన్నమయ్య జిల్లా అధ్యక్షులు పి.సురేంద్ర యాదవ్ సాయితేజ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వీర జవాన్ త్యాగాలను స్మరించుకుంటూ ఆయన దేశ సేవలో చూపిన ధైర్యం,అంకితభావం యువతకు ఆదర్శమని కొనియాడారు. దేశ సేవలో ప్రాణాలర్పించిన జవాన్ చేసిన సైనికుల త్యాగాలను ఎప్పటికీ మరువకూడదని,వారి స్ఫూర్తితో యువత ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు. అదేవిధంగా యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి దేశ సేవకు పునరంకితం కావాలని పిలుపునిచ్చారు. వీర జవాన్ సాయి తేజ భరతమాత ముద్దుబిడ్డని,ఆయన కురబలకోట మండలంలో జన్మించడం ఈ ప్రాంత వాసులు అదృష్టమన్నారు. ఆయన దేశానికి అందించిన సేవలు ఈ ప్రాంత వాసుల్లో ఎప్పటికీ గుర్తుండి పోతాయన్నారు.

## అమరావతి అభివృద్ధిలో మరో ముందడుగు..

## క్వాంటం వ్యాలీలో ట్విన్ టవర్లకు గ్రీన్ సిగ్నల్

ఉత్తర్వులు జారీ చేసింది. గత నెల (ఏప్రిల్) 23వ తేదీన జరిగిన 60వ ఏపీసీఆర్‌డీఏ అథారిటీ సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేరకు ఈ నిధులను మంజూరు చేసింది.

టెండర్ల విధానం..

ఈ ప్రాజెక్టును 'డిజైన్ బిల్డ్ లంప్సమ్' పర్సంటేజ్ టెండర్ విధానంలో చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనివల్ల నిర్మాణ సంస్థ ప్లానింగ్, డిజైనింగ్, ఎగ్జిక్యూషన్ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించే అవకాశం ఉంటుంది. ఈ భారీ నిర్మాణ పనులకు సంబంధించి టెండర్ల ప్రక్రియను తక్షణమే ప్రారంభించాలని అమరావతి గ్రోత్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ ను ఏపీ ప్రభుత్వం ఆదేశించింది. ప్రాజెక్టు పర్యవేక్షణ, అమలు బాధ్యతలను ఏజీఐసీఎల్ మేనేజింగ్ డైరెక్టర్‌కు అప్పగిస్తూ ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది.

ప్రాధాన్యం..

క్వాంటం వ్యాలీ ప్రాంతంలో ఈ టవర్లు రావడం వల్ల ఐటీ, పరిపాలన, వాణిజ్య రంగాలు మరింత వేగంగా వృద్ధి చెందే అవకాశం ఉంది. అమరావతిని గ్లోబల్ సిటీగా తీర్చిదిద్దే క్రమంలో ఇవి ఐకానిక్ కట్టడాలుగా నిలవనున్నాయి. అమరావతి నిర్మాణ పనుల్లో వేగం పెంచిన ఏపీ ప్రభుత్వం రూ. 1208.41 కోట్లకు పైగా నిధులతో ట్విన్ టవర్ల నిర్మాణానికి పచ్చజెండా ఊపడం రాజధాని ప్రాంతంలో రియల్ ఎస్టేట్, అభివృద్ధి పనులకు కొత్త ఊపునిస్తోంది.

## మంత్రి లోకేశ్ పనితీరు చాలా బాగుంది..

## వెంకయ్యనాయుడు ప్రశంసలు

ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, నెల్లూరు ఆర్టీసీ రీజనల్ చైర్మన్ సురేశ్ రెడ్డి, దీపావెంకట్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంకయ్య నాయుడు మాట్లాడారు. ఆధ్యాత్మికత మానసిక ఉల్లాసాన్ని, ఆనందాన్ని కలిగిస్తోందని వ్యాఖ్యానించారు. తల్లిదండ్రులు పిల్లలకు సమయాన్ని కేటాయించట్లేదని.. మొబైల్, టీవీలకు మాత్రమే సమయాన్ని కేటాయించడం సరికాదని పేర్కొన్నారు.

పత్రికల్లో వచ్చే వార్తలను చూస్తోంటే సిగ్గేస్తోంది..

తిరుమల వేంకటేశ్వరస్వామిని ఏడాదిలో ఒక్కసారి మాత్రమే దర్శించుకోవాలని తాను నిర్ణయం తీసుకున్నానని చెప్పుకొచ్చారు. సమాజం గతితప్పినప్పుడే వారిని సరైన మార్గంలో పెట్టేందుకు దివ్య స్వరూపులైన యోగి భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి, పుట్టపర్తి సాయిబాబా, షిర్డీ సాయిబాబా లాంటి అవధూతలు భూమిపైకి వచ్చారని ప్రస్తావించారు. ఏదైనా పని చేయాలంటే మనసులో, కుటుంబంలో, గ్రామంలో, రాష్ట్రంలో, దేశంలో, ప్రపంచంలో కూడా శాంతి ఉండాలని సూచించారు. పాశ్చాత్య వ్యామోహం ఎక్కువై మనదేశంలో కూడా మార్పులు వస్తున్నాయని తెలిపారు. రోజూ పత్రికల్లో వచ్చే వార్తలను చూస్తోంటే సిగ్గేస్తోందని వెంకయ్యనాయుడు పేర్కొన్నారు.

## విజయవాడ రైల్వే స్టేషన్‌లో వసూళ్ల పర్వం

చివరికి బాధితుడు మాత్రం సాధారణ ప్రయాణికుడే అవుతున్నాడు. ఈ నేపథ్యంలో తక్షణ చర్యలు తీసుకోవాల్సిన అవసరం స్పష్టంగా కనిపిస్తోంది. సీసీటీవీ ఫుటేజ్‌ల పరిశీలన, విజిలెన్స్ లేదా సీబీఐ స్థాయి విచారణ, నియామకాల సమయంలో సమర్పించిన సర్టిఫికెట్ల ధృవీకరణ, సంబంధిత ఉద్యోగుల బదిలీలు పరిశీలించాలి. చర్యలు తీసుకోవాలనే చిత్తశుద్ధి ఉంటే ఈ ముగ్గురి సర్వీస్ రిజిష్టర్లు చూసినా వాళ్లేంటో తెలిసిపోతుంది. విజయవాడ వంటి కీలక రైల్వే హబ్‌లో ఈ తరహా ఆరోపణలు వెలుగులోకి రావడం, భారతీయ రైల్వే ప్రతిష్టకే సవాల్‌గా మారింది. ఇప్పుడు ప్రశ్న ఒక్కటే ఈ ఆరోపణలపై అధికారులు నిజంగా చర్యలు తీసుకుంటారా? లేక ఇది ఇంకోటి అనుకుని మూలన పడేస్తారా?

# శ్రీ పెనుసుల లక్ష్మీ నరసింహా స్వామికి పట్టు వస్త్రాల సమర్పించిన శ్రీశైలం చైర్మన్







రాజంపేట(ప్రజా సీమ) :శ్రీ పెనుసుల లక్ష్మీనరసింహస్వామి జయంతి సందర్భంగా శ్రీశైలం శ్రీ భ్రమరాంబ మల్లికార్జున ఆలయం తరపున ఆలయ చైర్మన్ పోతు గుంట రమేష్ నాయుడు స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంతో పవిత్రమైన క్షేత్రమని స్వామివారి దర్శనం చక్కగా జరిగిందని ఆలయ ఈవో రెడ్డిగారు ఆలయ చైర్మన్ తిరుపాల్రెడ్డి ఆలయం మొక్క ద్వారా దగ్గర స్వాగతం పలకడం జరిగింది ఈ కార్యక్రమంలో ఆలయ ప్రత్యేక ఆహ్వానితులు వీ కోటారెడ్డి శ్రీనివాసులు ఆలయ బోర్డు మెంబర్ బాల గురుస్వామి వారి ధర్మపత్ని మరియు ఆలయ ఏఈఓ హరిదాసు పూజారులు రాధాకృష్ణ శర్మ తదితరులు పాల్గొన్నారు.

# మదనపల్లెలో నేడు హెల్పింగ్ మైండ్స్ 13వ వార్షికోత్సవ వేడుకలు

### - హాజరు కానున్న ప్రముఖ సినీ నటుడు సప్తగిరి
### - పాత్రికేయులకు,హెల్పింగ్ మైండ్స్ సభ్యులకు ఆహ్వానం




మదనపల్లె (ప్రజా సీమ) : హెల్పింగ్ మైండ్స్ 13వ వార్షికోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా ప్రముఖ సినీ నటులు సప్తగిరి హాజరతున్నట్లు హెల్పింగ్ మైండ్స్ వ్యవస్థాపకుడు అబూబక్కర్ సిద్దిక్ తెలిపారు. ఈ సందర్భంగా శనివారం ఆయన మాట్లాడుతూ 13 సంవత్సరాలుగా వలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న హెల్పింగ్ మైండ్స్ సేవలు మరింత విస్తృతం చేసేలా భవిష్యత్తు ప్రణాళికతోపాటు చిన్నారుల నృత్యాలు,యూత్ కరాటే క్లబ్ విద్యార్థుల విన్యాసాలు,సి.పి.ఆర్ అవగాహన మరిన్ని అంశాలు మే 3వ తేదీ ఆదివారం సాయంత్రం 5 గంటలకు మదనపల్లి శ్రీ కృష్ణ కళ్యాణ మండపంలో 13వ వార్షికోత్సవ వేడుకలకు హెల్పింగ్ మైండ్స్ బృందం ఆత్మీయ ఆహ్వానం అందజేసింది.

# జీఎన్ నాయుడు పార్థివ దేహానికి సీఎం చంద్రబాబు నివాళులు



హైదరాబాద్,( ప్రజా సీమ) పారిశ్రామిక వేత్త, రీజెన్సీ గ్రూప్ అధినేత జీఎన్ నాయుడు పార్థివ దేహానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నివాళులర్పించారు. హైదరాబాద్‌లో వారి నివాసానికి వెళ్లి జీఎన్ నాయుడుకు నివాళులర్పించారు. తెలుగు ప్రజలు మంచి పారిశ్రామికవేత్తను కోల్పోయారని, రీజెన్సీ స్థాపనతో యువతకు ఉపాధి కల్పనలో జీఎన్ నాయుడు కృషి ఎనలేనిదని సీఎం అన్నారు. సమాజ సేవకు జీఎన్ నాయుడు తన వంతు కృషి చేశారని చెప్పారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించిన సీఎం... తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ సందర్భంగా జీఎన్ నాయుడుతో తనకు ఉన్న పరిచయాన్ని ముఖ్యమంత్రి గుర్తు చేసుకున్నారు.

# జిల్లాలో ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసులను సత్వరమే పరిష్కరించాలి

### - ఎస్సీ,ఎస్టీల ఆర్థికాభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ
### - జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్,జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి





మదనపల్లె (ప్రజా సీమ) : జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసులపై ప్రత్యేక దృష్టి సారించి సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం మదనపల్లి కలెక్టరేట్లో సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టర్ అధ్యక్షతన జిల్లా నిఘా మరియు పర్యవేక్షణ కమిటి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి,డిఆర్ఓ చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోలీస్,రెవెన్యూ,ప్రాసిక్యూషన్ విభాగాలు సమన్వయంతో పనిచేసి ఎస్సీ,ఎస్టీ వర్గాలపై నమోదు అయిన కేసుల్లో జాప్యాన్ని నివారించి సత్వర న్యాయం అందించాలన్నారు. జిల్లాలో ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసుల పరిష్కారంలో భాగంగా సంఘటనలు జరిగిన వెంటనే పోలీసులు నిష్పక్షపాతంగా విచారణచేసి కేసులు నమోదు చేయాలన్నారు. ఎఫ్ఐఆర్ కాగానేబాధితులకు పరిహారం అందజేసేలా సంబంధిత అధికారులువెంటనేచర్యలుతీసుకోవాలన్నారు. జిల్లాలో ఎస్సీ,ఎస్టీలకు ఎక్కడ అన్యాయం జరిగినా అధికారుల దృష్టికి తీసుకురావాలని డివిఎంసి కమిటీ సభ్యులకు సూచించారు. 2025 సెప్టెంబర్ 10 నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి వరకు వరకు జిల్లాలో మొత్తంగా 14 ఎస్సీ,ఎస్టీ కేసులు నమోదు అయి విచారణ దశలో ఉన్నాయని వాటిని త్వరగా పరిష్కరించాలని సూచించారు. ఈ సందర్భంగా కేసువారీగా పరిష్కార చర్యలపై చర్చించారు. ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో బాధితులకు సత్వరం న్యాయం జరిగేలా పోలీసులతోపాటు సంబంధిత శాఖల అధికారులు చొరవ తీసుకోవాలని కలెక్టర్ చెప్పారు. కేసులలో ఎప్పటి కప్పుడు ఛార్జిషీట్ దాఖలు చేయడంతో పాటు నిర్ణీత సమయంలోగా కేసులను పూర్తిచేయాలని అన్నారు. బాధితులకు ప్రభుత్వం తరపున ఆర్థిక సహాయం సకాలంలో అందేలా చూడాలన్నారు.

**ఎస్సీ,ఎస్టీల ఆర్థికాభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ**

జిల్లా నందలి ఎస్సీ,ఎస్టీలు ఆర్థికంగా అభివృద్ధి చెందేలా తగిన కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని అధికారులకు సూచించారు. జలధార కార్యక్రమం వల్ల జిల్లాలో భూగర్భ జలాలు,నీటి వనరులు పెరిగాయి. ప్రతి గ్రామంలో ఆసక్తి గలవారికి పాలిచ్చే పశువులు పెంచుకునేలా ప్రోత్సహిస్తున్నామని,ఈ మేరకు ఎస్సీ ఎస్టీలను కూడా ప్రోత్సహించాలని అధికారులకు సూచించారు. మాన్సూన్ సీజన్ మొదలయ్యేలోపు ఆసక్తి గలవారు ముందుకు వస్తే డిఆర్డిఏ శాఖ ద్వారా ఎస్సీ,ఎస్టీల మహిళ సంఘాలకు బ్యాంకు రుణాలు మంజూరు చేస్తామని కలెక్టర్ పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి మాట్లాడుతూ జిల్లాలో నమోదైన ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులకు సంబంధించి ఎలాంటి పక్షపాతం,జాప్యం లేకుండా విచారణ చేయడం జరుగుతుందన్నారు. ఇందుకు సంబంధించి ఇప్పటికే అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశామన్నారు. ఈ సందర్భంగా ఎస్సీ,ఎస్టీ కేసులకు సంబంధించిన ఎలాంటి సమాచారం అయినా తమ దృష్టికి తీసుకురావాలని సభ్యులను కోరారు. ఇప్పటికే నమోదైన అండర్ ట్రయల్ కేసులు,వాటి పరిష్కారం కొరకు తీసుకోవాల్సిన చర్యలపై ఎస్డిపిఓలు,డీవీఎంసీ సభ్యులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లాలో నమోదైన ఎస్సీ ఎస్టీ కేసుల ప్రగతి,ఆయా అంశాలలో తీసుకున్న చర్యలపై డివిఎంసి సభ్యులు అడిగిన సందేహాలకు కలెక్టర్ మరియు ఎస్పి సందేహాలు నివృత్తి చేశారు. ఈ సందర్భంగా జిల్లాలో అన్ని మండలాలలో ఎస్సీ,ఎస్టీల స్మశాన వాటికలు ఏర్పాటు చేస్తే బాగుంటుందని కమిటీ సభ్యులు కలెక్టరుకి విన్నవించారు. అంతకుముందుగా గత సమావేశంలో చర్చించిన అంశాలపై సంబంధిత అధికారులు తీసుకున్న చర్యలు పరిష్కరించిన కేసులపై సమావేశంలో చర్చించి,ఇంకనూ తీసుకోవాల్సిన చర్యలపై కలెక్టర్,ఎస్పీ అధికారులకు పలు సూచనలు జారీ చేశారు. ఈ సమావేశంలో ఆర్డీవో శ్రీనివాస్,సాంఘిక సంక్షేమ శాఖ అధికారి ఎం.శ్రీరాములు,డీఎస్పీలు, డివిఎంసి సభ్యులు వెంకటరమణ,రామకృష్ణ,పాలకుంట శ్రీనివాసులు,రాజశేఖర్,చంద్రశేఖర్ బోడేషావలి,వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు హాజరయ్యారు.

# అనకాపల్లిలో 'పోలీస్ ట్రాన్సిట్ ఫెసిలిటీ' ప్రారంభం

### పాల్గొన్న ఐజీ, కలెక్టర్ మరియు ఎస్పీ



అనకాపల్లి (ప్రజా సీమ) : అనకాపల్లి జిల్లా కేంద్రంలో పోలీస్ అధికారుల సౌకర్యార్థం అత్యాధునిక వసతులతో నిర్మించిన 'పోలీస్ ట్రాన్సిట్ ఫెసిలిటీ' భవనాన్ని ఈరోజు ఘనంగా ప్రారంభించారు. ఆర్సెలర్ మిట్టల్ నిప్పన్ స్టీల్ (ఏ ఎమ్ ఎన్ ఎస్) సంస్థ తమ సామాజిక బాధ్యత (సిఎస్ఆర్) నిధులతో నిర్మించిన ఈ భవనాన్ని విశాఖపట్నం రేంజ్ ఐజీ గోపీనాథ్ జట్టి, ఐపీఎస్, జిల్లా కలెక్టర్ శ్రీమతి విజయకృష్ణ, ఐఏఎస్ మరియు జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా, ఐపీఎస్ సంయుక్తంగా ప్రారంభించారు. విశాఖ రేంజ్ ఐజీ గోపీనాథ్ జట్టి, ఐపీఎస్ గారు మాట్లాడుతూ, కొత్తగా ఏర్పడిన జిల్లాలో మౌలిక వసతుల కల్పన దిశగా ఇది ఒక మంచి పరిణామమని పేర్కొన్నారు. విధుల్లో భాగంగా జిల్లాకు వచ్చే అధికారులకు ఈ భవనం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, ఇందుకు సహకరించిన ఏ ఎమ్ ఎన్ ఎస్ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. శ్రీమతి విజయ కృష్ణన్, ఐఏఎస్ మాట్లాడుతూ, అభివృద్ధి కార్యక్రమాల్లో కార్పొరేట్ సంస్థల భాగస్వామ్యం ప్రశంసనీయమని, పోలీస్ యంత్రాంగానికి మెరుగైన వసతులు కల్పించడం ద్వారా వారి సేవల సామర్థ్యం మరింత పెరుగుతుందని అభిప్రాయపడ్డారు. తుహిన్ సిన్హా, ఐపీఎస్ మాట్లాడుతూ, జిల్లా పోలీసుల సంక్షేమం మరియు పనితీరు మెరుగుపరచడానికి ఇలాంటి వసతులు దోహదపడతాయని తెలిపారు. పోలీస్ శాఖకు నిరంతరం సహకారం అందిస్తున్న అధికారులకు మరియు సంస్థలకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఈస్ట్ ఏ ఎమ్ఎన్ ఎస్ చీఫ్ ప్రాజెక్ట్స్ శ్రీ కె.ఏ.చౌదరి గారు వారి సహధర్మ చారిణితో పాల్గొని, సామాజిక బాధ్యతలో భాగంగా జిల్లా అభివృద్ధికి తమ సంస్థ ఎల్లప్పుడూ తోడ్పాటునందిస్తుందని తెలిపారు. వీరితో పాటు అడిషనల్ ఎస్పీ (క్రైమ్స్) శ్రీ ఎల్.మోహన్ రావు, ఎస్.బి డీఎస్పీ శ్రీ జీ.ఆర్.ఆర్.మోహన్, అనకాపల్లి సబ్ డివిజన్ డీఎస్పీ శ్రీమతి కె.శ్రావణి, ఇన్స్పెక్టర్లు బాల సూర్యారావు, జి.ప్రేమ్ కుమార్, జి.అశోక్ కుమార్, ఎం.వెంకటనారాయణ, మరియు ఐటీ కోర్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# బీసీల అభ్యున్నతికి ముసలికుంట నాగయ్య సేవలు అమోఘం

### - ఘనంగా సన్మానించిన ఎమ్మెల్యే షాజహాన్ బాషా



మదనపల్లె (ప్రజా సీమ) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రజక సంఘాల సమాఖ్య వర్కింగ్ ఛైర్మనుగా ఎన్నికైన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు,బిసి సెల్ టిడిపి నియోజకవర్గం అధ్యక్షులు ముసలికుంట నాగయ్యను ఎమ్మెల్యే షాజహాన్ బాషా శాలువా,పూలమాలతో ఘనంగా సన్మానించి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మదనపల్లె శాసనసభ్యులు ఎం.షాజహాన్ బాషా మాట్లాడుతూ ముసలికుంట నాగయ్య బీసీ నాయకుడిగా తెలుగుదేశం పార్టీలో నిబద్ధత కలిగిన నేతగా,పార్టీ అభివృద్ధి,బలోపేతం చేయడానికి కట్టుబడి సేవలందిస్తున్నారని ప్రశంసించారు. ఇందులో భాగంగా రజక సంఘాల సమైఖ్యా రాష్ట్ర వర్కింగ్ కమిటీ చైర్మనుగా ఎంపిక కావడం పట్ల ప్రత్యేకంగా అభినందనలు,శుభాకాంక్షలు తెలియజేశారు. రజకుల సంక్షేమం అభివృద్ధికి,ప్రభుత్వంతో కలసి తమవంతు సహాయ సహకారాలు ఎప్పటికి అందిస్తామని పేర్కొన్నారు. అనంతరం ముసలికుంట నాగయ్య స్పందిస్తూ తమ సేవలను ఎమ్మెల్యే గుర్తించి సన్మానించి శుభాకాంక్షలు తెలపడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. పార్టీ అభివృద్ధి,బలోపేతం చేయడం కోసం ఎమ్మెల్యే ఆదేశాలకు కట్టుబడి ఎప్పుడు సేవలు అందించడానికి ముందు ఉంటామని పేర్కొన్నారు. రజకుల అపరిష్కృత సమస్యలను పరిష్కరించడానికి ఎమ్మెల్యే చొరవ చూపాలని కోరారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు,యువ మంత్రి నారా లోకేష్ బాబు,ప్రజల అభిమాన నాయకుడు ఎమ్మెల్యే షాజహాన్ బాషా సారథ్యంలో పనిచేయడం గర్వంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఏపీ మైనార్టీ రాష్ట్ర కార్యదర్శి మస్తాన్ వల్లి,తెలుగుదేశం పార్టీ నాయకులు,కార్యకర్తలు కుటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు.

PRGI Regd. No : APTEL/26/A0819
నేటిపత్రిక ప్రజాసీమ జాతీయ తెలుగుదినపత్రిక


# ప్రొద్దుటూరులో నూతన డిసిసి బ్యాంక్ భవనం ప్రారంభం

## - ప్రారంభించిన ఉమ్మడి కడప జిల్లా డిసిసి బ్యాంక్ చైర్మన్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి







ప్రొద్దుటూరు (ప్రజా సీమ) :ప్రొద్దుటూరు నియోజకవర్గం మైదుకూరు రోడ్డులో, కొత్త ఆటో నగర్ ఎదురుగా నూతనంగా ఏర్పాటు చేసిన కడప జిల్లా సెంట్రల్ కో–ఆపరేటివ్ బ్యాంక్ (డీసీసీ బ్యాంక్) భవనాన్ని ఉమ్మడి కడప జిల్లా డీసీసీ బ్యాంక్ చైర్మన్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి ప్రారంభించారు. ఇంతకుముందుమైదుకూరు రోడ్డులోని అన్వర్ థియేటర్ ఎదురుగా ఉన్న డీసీసీ బ్యాంక్ శాఖను, ప్రజలకు మరింత సౌకర్యవంతంగా ఉండే విధంగా కొత్త ఆటో నగర్ ఎదురుగా నూతన భవనానికి మార్చడం జరిగింది. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ప్రొద్దుటూరు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి మరియు యువ నాయకులు నంద్యాల కొండారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారికి శాలువాతో ఘనంగా సత్కారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడిన డీసీసీ బ్యాంక్ చైర్మన్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి బ్యాంక్ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడం, సౌకర్యాలను మెరుగుపరచడం లక్ష్యంగా నూతన భవనాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రైతులు, మహిళా సంఘాలు మరియు ఖాతాదారులకు మెరుగైన బ్యాంకింగ్ సేవలు అందించేందుకు కట్టుబడి ఉన్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, బ్యాంక్ సిబ్బంది మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బీసీల అభ్యున్నతికి ముసలికుంట నాగయ్య సేవలు అమోఘం

## - ఘనంగా సన్మానించిన ఎమ్మెల్యే షాజహాన్ బాషా



మదనపల్లె (ప్రజా సీమ) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రజక సంఘాల సమాఖ్య వర్కింగ్ ఛైర్మనుగా ఎన్నికైన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు,బిసి సెల్ టిడిపి నియోజకవర్గం అధ్యక్షులు ముసలికుంట నాగయ్యనుఎమ్మెల్యే షాజహాన్ బాషా శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మదనపల్లె శాసనసభ్యులు ఎం. షాజహాన్ బాషా మాట్లాడుతూ ముసలికుంట నాగయ్య బీసీ నాయకుడిగా తెలుగుదేశం పార్టీలో నిబద్ధత కలిగిన నేతగా,పార్టీ అభివృద్ధి,బలోపేతం చేయడానికి కట్టుబడి సేవలందిస్తున్నారని ప్రశంసించారు. ఇందులో భాగంగా రజక సంఘాల సమైఖ్యా రాష్ట్ర వర్కింగ్ కమిటీ చైర్మనుగా ఎంపిక కావడం పట్ల ప్రత్యేకంగాఅభినందనలు,శుభాకాంక్షలు తెలియజేశారు. రజకుల సంక్షేమం అభివృద్ధికి, ప్రభుత్వంతో కలసి తమవంతు సహాయ సహకారాలు ఎప్పటికి అందిస్తామని పేర్కొన్నారు. అనంతరం ముసలికుంట నాగయ్య స్పందిస్తూ తమ సేవలను ఎమ్మెల్యే గుర్తించి సన్మానించి శుభాకాంక్షలు తెలపడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. పార్టీ అభివృద్ధి,బలోపేతం చేయడం కోసం ఎమ్మెల్యే ఆదేశాలకు కట్టుబడి ఎప్పుడు సేవలు అందించడానికి ముందు ఉంటామని పేర్కొన్నారు. రజకుల అపరిష్కృత సమస్యలను పరిష్కరించడానికి ఎమ్మెల్యే చొరవ చూపాలని కోరారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు,యువ మంత్రి నారా లోకేష్ బాబు,ప్రజల అభిమాన నాయకుడు ఎమ్మెల్యే షాజహాన్ బాషా సారథ్యంలో పనిచేయడం గర్వంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఏపీ మైనార్టీ రాష్ట్ర కార్యదర్శి మస్తాన్ వల్లి,తెలుగుదేశం పార్టీ నాయకులు,కార్యకర్తలు కుటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు.


# ఎస్.ఎస్.సి - 2026 ఫలితాలలో మెరిసిన తపస్య ఆణిముత్యాలు

## - 582 మార్కులతో సత్తాచాటిన జి.పూర్ణలక్ష్మీ- విద్యార్థులను అభినందించిన పాఠశాల యజమాన్యం



కలికిరి (ప్రజా సీమ) : ఏపీ ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన పదవ తరగతి ఫలితాలలో తపస్య విద్యార్థులు చరిత్ర సృష్టించారు. కలికిరి మండలం,కే.రెడ్డివారిపల్లి నందు గల తపస్య పాఠశాలలో 2025 -26 విద్యాసంవత్సరం పదవ తరగతి విద్యార్థులు అద్భుత ఫలితాలు సాధించినట్లు పాఠశాల కరస్పాండెంట్ ఎం.రామాంజులు నాయుడు,క్యాంపస్ ఇంచార్జి ఎం.శివ ప్రసాద్,పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాధవి,ప్రేమలతలు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా శనివారం వారు మాట్లాడుతూ తమ పాఠశాలలో 600 మార్కులకుగాను జి.పూర్ణలక్ష్మి 582 మార్కులతో మొదటి స్థానంలో నిలువగా,టి.సాయి సంపృతి 581 మార్కులతో ద్వితీయ స్థానంలో,పి.దీప్తి 579 మార్కులతో తృతీయ స్థానంలో నిలిచారని తెలిపారు. మొత్తం 27మంది పరీక్ష రాయగా ఏడుగురు విద్యార్థులు 550లకు పైగా మార్కులు సాధించడం పాఠశాలకే గర్వకారణమన్నారు. మిగిలిన విద్యార్థులు ఫస్ట్ క్లాస్ మార్కులు సాధించారన్నారు. ఇంతటి గొప్ప విజయానికి కారణమైన విద్యార్థులు,కృషి చేసిన ఉపాధ్యాయులు,సహకరించిన తల్లిదండ్రులకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. ఇందులో భాగంగా ఉత్తీర్ణులైన విద్యార్థినీ,విద్యార్థులకు మిఠాయిలు పంచిపెట్టి అభినందించారు. భవిష్యత్తులో ఇదే స్ఫూర్తితో పనిచేసి మరింత మెరుగైన ఫలితాలు సాధనే లక్ష్యంగా ముందుకు సాగుతామని వారు స్పష్టం చేశారు.

# మాచుపల్లె లో ఘనంగా రేణుక ఎల్లమాంబ కళ్యాణం





సిద్ధవటం ( ప్రజా సీమ) : మండలంలోని మాచుపల్లి గ్రామంలో వెలసిన శ్రీ రేణుక ఎల్లమాంబ తిరుణాల సందర్భంగా శనివారం శ్రీ జగజ్జనని రేణుక ఎల్లమాంబ సమేత జమదగ్ని మహారాజు ఉత్సవ మూర్తుల విగ్రహాలకు ఘనంగా కళ్యాణం నిర్వహించారు ఈ సందర్భంగా గణపతి పూజ వ్రుణ్యాహవాచనం, యజ్ఞోపదారణ, కంకణ దారుణ, జిలకర బెల్లం, మాంగళ్ల ధారణ, ముత్యాల తలంబ్రాలు వంటి పూజా కార్యక్రమాలతో పేద పండితులు రంగసముద్రం మల్లికార్జున శర్మ, సుబ్రమణ్యం శర్మ, ప్రదీప్ శర్మ వేద మంత్రాలతో మంగళ వాయిద్యాల మధ్య ఘనంగా కళ్యాణ మహోత్సవం నిర్వహించారు కళ్యాణం తిలకించేందుకు అధిక సంఖ్యలో భక్తులు విచ్చేశారు కొందరు భక్తులు రేణుక ఎల్లమాంబ మూలవిరాట్ విగ్రహాలను దర్శించుకుని కాయ కర్పూరాల సమర్పించి తీర్చ ప్రసాదాలు స్వీకరించారు ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు యువత, మహిళలు పాల్గొన్నారు

# లక్ష్మీనరసింహ స్వామి వారిని దర్శించుకున్న తెదేపా నియోజకవర్గ ఇన్చార్జ్ చమర్తి

## - ఘన స్వాగతం పలికిన ఆలయ అర్చకులు,ధర్మకర్త మండలి సభ్యులు









రాజంపేట(ప్రజా సీమ) : శనివారం రాజంపేట మండలం భువనగిరి పల్లె గ్రామం నందు పర్యటిస్తూ లక్ష్మీనరసింహస్వామి వారి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు,గ్రామస్తుల ఆహ్వానం మేరకు హాజరై స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించిన నియోజకవర్గ ఇన్చార్జ్ శ్రీ చమర్తి జగన్ మోహన్ రాజు అనంతరం వేద పండితులు తీర్థ ప్రసాదాలు అందజేసి ఆలయం విశిష్టతను చమర్తి జగన్ మోహన్ రాజు కి వివరించారు. అంతకుముందు వేద పండితులు,నిర్వాహకులు ఆలయ మర్యాదలతో మంగళ వాయిద్యాల మధ్య చమర్తి జగన్ మోహన్ రాజు కి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా చమర్తి మాట్లాడుతూ ఆలయాభివృద్ధికి తనవంతు సహకరిస్తానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులు,ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు,పలువురు ముఖ్య నాయకులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# పది ఫలితాలలో సత్తాచాటిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు

## - ఎమ్మెల్యే షాజహాన్ బాషాచే ఘనసన్మానం



మదనపల్లె (ప్రజా సీమ) : పది ఫలితాలలో సత్తాచాటిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు సత్తాచాటారు. మొదటి మూడు ర్యాంకులు సాధించిన వారికి రెండు సెంట్లు భూమి ఇంటి నిర్మాణం కోసం రూ.3 లక్షలు మంజూరు చేయిస్తానని పదో తరగతి మెరిట్ విద్యార్థుల అభినం దన సభలో మదనపల్లి ఎమ్మెల్యే షాజహాన్ బాషా టెన్త్ పేపర్లకు కానుకను ప్రకటించారు. మొదట మూడు ర్యాంకులు సాధించిన ఆది విష్ణు,షేక్ హుస్నా,కావ్య,షేక్ సాజియాలకు రెండు సెంట్లు భూమితోపాటు ఇంటి నిర్మాణం చేసుకునేందుకు మూడు లక్షల రూపాయలు రుణాన్ని ఇప్పిస్తానని ప్రకటించారు. ఇటీవల విడుదలైన పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో అత్యంత ప్రతిభ కనబరిచిన 550 పైగా మార్కులు సాధించిన మదనపల్లి,రామసముద్రం,నిమ్మనపల్లి మండలాలకు చెందిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థిని,విద్యార్థులకు శనివారం ఉదయం మదనపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అభినందన సభ ఏర్పాటు చేయడం జరిగింది. నియోజకవర్గ పరిధిలో 70 మంది విద్యార్థులు వారి తల్లిదండ్రులకు ఎమ్మెల్యే షాజహాన్ బాషా శాలువాతో సత్కరించి,స్టడీ మెటీరియల్ బహుమతులుగా అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే షాజహాన్ బాషా మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు ప్రైవేటు పాఠశాలకు ధీటుగా ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నాయన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు,మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేష్ బాబు ఆధ్వర్యంలో మన రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలో మంచి ఫలితాలు సాధిస్తున్నాయన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివిన విద్యార్థులు ప్రవేటు పాఠశాలల విద్యార్థులకు పోటీగా మంచి మార్కులు సాధించడం హర్షించదగ్గ పరిణామమన్నారు. మదనపల్లి నియోజకవర్గంలోని ప్రతిభ కనబరిచిన విద్యార్థిని,విద్యార్థులతోపాటు వారి తల్లిదండ్రులు ఉపాధ్యాయులను కూడా శాలువా,సర్టిఫికెట్లతో సత్కరించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి రాష్ట్రంలో విద్యా రంగానికి పెద్దపీట వేయడం జరుగుతుందని,దీనికి నిదర్శనం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు సాధించిన మార్కులేనన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ కె.సుబ్రహ్మణ్యం,మదనపల్లి,నిమ్మనపల్లి,రామసముద్రం,బి.కొత్తకోటలకు చెందిన ఎంఈఓలు,ప్రధానోపాధ్యాయులు,విద్యార్థుల తల్లిదండ్రులు,పేరెంట్స్ కమిటీ సభ్యులు,తెలుగుదేశం నాయకులు కత్తి లక్ష్మన్న,జెసిబి వేణు,ఎస్.ఆర్ షంషీర్,నాదెండ్ల శివప్రసాద్, టైగర్ సురేందర్ రెడ్డి,రమేష్ రెడ్డి,పెద్ద సంఖ్యలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# నందలూరు మండలంలో జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయి పర్యటన

## లేబాకు చెరువు,మర్రిపల్లి ఫీడర్ ఛానల్ కాలువ పనులను పరిశీలన




నందలూరు(ప్రజా సీమ) : జలధార-జలహారతి కార్యక్రమంలో భాగంగా శనివారం జిల్లా కలెక్టర్ డా.శ్రీధర్ చెరుకూరి రాజంపేట సబ్ కలెక్టర్ భావనతో కలసి నందలూరు మండలంలోని చేపడుతున్న పనులను క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. ఇందులో భాగంగా మర్రిపల్లి గ్రామంలోని ఫీడర్ ఛానల్ కాలువ పనులను పరిశీలించి, సాగునీరు సజావుగా అందేలా కాలువల నిర్వహణ ఉండాలని అధికారులను ఆదేశించారు. అనంతరం లేపాక చెరువును సందర్శించి, నీటి నిల్వ సామర్థ్యం,ఆయకట్టు తదితర అంశాలపై సమీక్ష చేసి, చెరువుల పునరుద్ధరణ పనుల్లో నాణ్యత పాటించాలని అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. రైతులకు సాగునీటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, జల సంరక్షణ పనులను ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేయాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో డ్వామా పీడీ ఆది శేషారెడ్డి, మైనర్ ఇరిగేషన్ ఎస్ఈ అబ్దుస్ సమీ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ఎస్.ఎస్.సి - 2026 ఫలితాలలో మెరిసిన తపస్య ఆణిముత్యాలు

## - 582 మార్కులతో సత్తాచాటిన జి.పూర్ణలక్ష్మీ
## - విద్యార్థులను అభినందించిన పాఠశాల యజమాన్యం




కలికిరి (ప్రజా సీమ) : ఏపీ ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన పదవ తరగతి ఫలితాలలో తపస్య విద్యార్థులుచరిత్ర సృష్టించారు .కలికిరి మండలం,కే.రెడ్డివారిపల్లి నందు గల తపస్య పాఠశాలలో 2025 -26 విద్యాసంవత్సరం పదవ తరగతి విద్యార్థులు అద్భుత ఫలితాలు సాధించినట్లు పాఠశాల కరస్పాండెంట్ ఎం.రామాంజులు నాయుడు,క్యాంపస్ ఇంచార్జి ఎం.శివ ప్రసాద్,పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాధవి,ప్రేమలతలు స్పష్టం చేశారు.ఈ సందర్బంగా శనివారం వారు మాట్లాడుతూ తమ పాఠశాలలో 600 మార్కులకుగాను జి.పూర్ణలక్ష్మి 582 మార్కులతో మొదటి స్థానంలో నిలువగా,టి.సాయి సంపృతి 581 మార్కులతో ద్వితీయ స్థానంలో,పి.దీప్తి 579 మార్కులతో తృతీయ స్థానంలో నిలిచారని తెలిపారు.మొత్తం 27మంది పరీక్ష రాయగా ఏడుగురు విద్యార్థులు 550లకు పైగా మార్కులు సాధించడం పాఠశాలకే గర్వకారణమన్నారు.మిగిలిన విద్యార్థులు ఫస్ట్ క్లాస్ మార్కులు సాధించారన్నారు.ఇంతటి గొప్ప విజయానికి కారణమైన విద్యార్థులు,కృషి చేసిన ఉపాధ్యాయులు, సహకరించిన తల్లిదండ్రులకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు.ఇందులో భాగంగా ఉత్తీర్ణులైన విద్యార్థినీ,విద్యార్థులకు మితాయిలు పంచిపెట్టి అభినందించారు.భవిష్యత్తులో ఇదే స్ఫూర్తితో పనిచేసి మరింత మెరుగైన ఫలితాలు సాధనే లక్ష్యంగా ముందుకు సాగుతామని వారు స్పష్టం చేశారు.

# లక్ష్మీనరసింహ స్వామి వారిని దర్శించుకున్న తెదేపా నియోజకవర్గ ఇన్చార్జ చమర్తి


## - ఘన స్వాగతం పలికిన ఆలయ అర్చకులు,ధర్మకర్త మండలి సభ్యులు






రాజంపేట(ప్రజా సీమ) : శనివారం రాజంపేట మండలం భువనగిరి పల్లె గ్రామం నందు పర్యటిస్తూ లక్ష్మీనరసింహస్వామి వారి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు,గ్రామస్తుల ఆహ్వానం మేరకు హాజరై స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించిన నియోజకవర్గ ఇన్చార్జ్ శ్రీ చమర్తి జగన్ మోహన్ రాజు అనంతరం వేద పండితులు తీర్థ ప్రసాదాలు అందజేసి ఆలయం విశిష్టతను చమర్తి జగన్ మోహన్ రాజు కి వివరించారు.అంతకుముందు వేద పండితులు,నిర్వాహకులు ఆలయ మర్యాదలతో మంగళ వాయిద్యాల మధ్య చమర్తి జగన్ మోహన్ రాజు కి ఘన స్వాగతం పలికారు.ఈ సందర్భంగా చమర్తి మాట్లాడుతూ ఆలయాభివృద్ధికి తనవంతు సహకరిస్తానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులు,ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు,పలువురు ముఖ్య నాయకులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.


# మాచుపల్లె లో ఘనంగా రేణుక ఎల్లమాంబ కళ్యాణం




సిద్ధవటం ( ప్రజా సీమ) : మండలంలోని మాచుపల్లి గ్రామంలో వెలసిన శ్రీ రేణుక ఎల్లమాంబ తిరుణాల సందర్భంగా శనివారం శ్రీ జగజ్జనని రేణుక ఎల్లమాంబ సమేత జమదగ్ని మహారాజు ఉత్సవ మూర్తుల విగ్రహాలకు ఘనంగా కళ్యాణం నిర్వహించారు ఈ సందర్భంగా గణపతి పూజ పుణ్యాహవాచనం, యజ్ఞోపదారణ, కంకణ దారుణ, జిలకర బెల్లం, మాంగళ్ల ధారణ, ముత్యాల తలంబ్రాలు వంటి పూజా కార్యక్రమాలతో పేద పండితులు రంగసముద్రం మల్లికార్జున శర్మ, సుబ్రమణ్యం శర్మ, ప్రదీప్ శర్మ వేద మంత్రాలతో మంగళ వాయిద్యాల మధ్య ఘనంగా కళ్యాణ మహోత్సవం నిర్వహించారు కళ్యాణం తిలకించేందుకు అధిక సంఖ్యలో భక్తులు విచ్చేశారు కొందరు భక్తులు రేణుక ఎల్లమాంబ మూలవిరాట్ విగ్రహాలను దర్శించుకుని కాయ కర్పూరాల సమర్పించి తీర్ధ ప్రసాదాలు స్వీకరించారు ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు యువత, మహిళలు పాల్గొన్నారు

# పది ఫలితాలలో సత్తాచాటిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు

## - ఎమ్మెల్యే షాజహాన్ బాషాచే ఘనసన్మానం



మదనపల్లె (ప్రజా సీమ) : పది ఫలితాలలో సత్తాచాటిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు సత్తాచాటారు.మొదటి మూడు ర్యాంకులు సాధించిన వారికి రెండు సెంట్లు భూమి ఇంటి నిర్మాణం కోసం రూ.3 లక్షలు మంజూరు చేయిస్తానని పదో తరగతి మెరిట్ విద్యార్థుల అభినందన సభలో మదనపల్లి ఎమ్మెల్యే షాజహాన్ బాషా టెన్త్ పేపర్లకు కానుకను ప్రకటించారు.మొదట మూడు ర్యాంకులు సాధించిన ఆది విష్ణు,షేక్ హుస్నా,కావ్య,షేక్ సాజియాలకు రెండు సెంట్లు భూమితోపాటు ఇంటి నిర్మాణం చేసుకునేందుకు మూడు లక్షల రూపాయలు రుణాన్ని ఇప్పిస్తానని ప్రకటించారు.ఇటీవల విడుదలైన పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో అత్యంత ప్రతిభ కనబరిచిన 550 పైగా మార్కులు సాధించిన మదనపల్లి,రామసముద్రం,నిమ్మనపల్లి మండలాలకు చెందిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థిని,విద్యార్థులకు శనివారం ఉదయం మదనపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అభినందన సభ ఏర్పాటు చేయడం జరిగింది.నియోజకవర్గ పరిధిలో 70 మంది విద్యార్థులు వారి తల్లిదండ్రులకు ఎమ్మెల్యే షాజహాన్ బాషా శాలువాతో సత్కరించి,స్టడీ మెటీరియల్ బహుమతులుగా అందజేశారు.ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే షాజహాన్ బాషా మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు ప్రైవేటు పాఠశాలకు ధీటుగా ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నాయన్నారు.రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు,మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేష్ బాబు ఆధ్వర్యంలో మన రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలో మంచి ఫలితాలు సాధిస్తున్నాయన్నారు.ప్రభుత్వ పాఠశాలలో చదివిన విద్యార్థులు ప్రవేటు పాఠశాలల విద్యార్థులకు పోటీగా మంచి మార్కులు సాధించడం హర్షించదగ్గ పరిణామమన్నారు.మదనపల్లి నియోజకవర్గంలోని ప్రతిభ కనబరిచిన విద్యార్థిని,విద్యార్థులతోపాటు వారి తల్లిదండ్రులు ఉపాధ్యాయులను కూడా శాలువా,సర్టిఫికెట్లతో సత్కరించారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి రాష్ట్రంలో విద్యా రంగానికి పెద్దపీట వేయడం జరుగుతుందని,దీనికి నిదర్శనం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు సాధించిన మార్కులేనన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ కె.సుబ్రహ్మణ్యం,మదనపల్లి,నిమ్మనపల్లి,రామసముద్రం,బి.కొత్తకోటలకు చెందిన ఎంఈఓలు,ప్రధానోపాధ్యాయులు,విద్యార్థుల తల్లిదండ్రులు,పేరెంట్స్ కమిటీ సభ్యులు,తెలుగుదేశం నాయకులు కత్తి లక్ష్మన్న,జెసిబి వేణు,ఎస్.ఆర్ షంషీర్,నాదెండ్ల శివప్రసాద్,ఉర్దూ ఉపాధ్యాయుడు మహమ్మద్ ఖాన్,మల్లికార్జున నాయుడు,బోనాసి జాన్ బాబు,టైగర్ సురేందర్ రెడ్డి,రమేష్ రెడ్డి,పెద్ద సంఖ్యలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.


# నందలూరు మండలంలో జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయి పర్యటన

## లేబాకు చెరువు,మర్రిపల్లి ఫీడర్ ఛానల్ కాలువ పనులను పరిశీలన






నందలూరు(ప్రజా సీమ) : జలధార-జలహారతి కార్యక్రమంలో భాగంగా శనివారం జిల్లా కలెక్టర్ డా.శ్రీధర్ చెరుకూరి రాజంపేట సబ్ కలెక్టర్ భావనతో కలసి నందలూరు మండలంలోని చేపడుతున్న పనులను క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. ఇందులో భాగంగా మర్రిపల్లి గ్రామంలోని ఫీడర్ ఛానల్ కాలువ పనులను పరిశీలించి, సాగునీరు సజావుగా అందేలా కాలువల నిర్వహణ ఉండాలని అధికారులను ఆదేశించారు. అనంతరం లేపాక చెరువును సందర్శించి, నీటి నిల్వ సామర్థ్యం,ఆయకట్టు తదితర అంశాలపై సమీక్ష చేసి, చెరువుల పునరుద్ధరణ పనుల్లో నాణ్యత పాటించాలని అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. రైతులకు సాగునీటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, జల సంరక్షణ పనులను ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేయాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో డ్వామా పీడీ ఆది శేషారెడ్డి, మైనర్ ఇరిగేషన్ ఎస్ఈ అబ్దుస్ సమీ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ఆలయ స్థలాలను కబ్జాకు గురి కాకుండా కాపాడండి

## - బిజెపి జిల్లా అధికార ప్రతినిధి గాలి హరిప్రసాద్



వేంపల్లె నేటి పత్రిక ప్రజాసీమ:స్థానిక వృషభాచలేశ్వర స్వామి దేవస్థానం అనుసంధానమైన శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయు స్థలాలను కబ్జాకు గురి కాకుండా కాపాడాలని బిజెపి జిల్లా అధికార ప్రతినిధి గాలి హరిప్రసాద్ కోరారు. శనివారం భజరంగ్ దల్, విశ్వ హిందూ పరిషత్ సభ్యులతో కలిసి ఇఓ కడప సుభాష్ కు వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ దేవస్థానానికి చెందిన షాపింగ్ కాంప్లెక్స్ ఉందని, కాంప్లెక్స్ వెనుక వైపు ప్రైవేట్ వ్యక్తుల స్థలాలు ఉన్నాయని, అందులో ఉన్న ప్రైవేట్ వ్యక్తుల యజమానులు దేవస్థాన స్థలాన్ని ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నట్లు ఆరోపించారు. ఈ విషయంపై అధికారులు చర్యలు తీసుకుని ఆ స్థలాలు కబ్జాకు గురి కాకుండా కాపాడాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు విశ్వనాథ్ రెడ్డి, దివాకర్, మురళి, పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

# నియోజకవర్గం కాపు,బలిజ జేఏసీ ఉపాధ్యక్షులుగా వరప్రసాద్

## - శుభాకాంక్షలు తెలిపిన కాపు,బలిజ నాయకులు



మదనపల్లె (ప్రజా సీమ) : అన్నమయ్య జిల్లా,మదనపల్లి నియోజకవర్గం కాపు,బలిజ జేఏసీ ఉపాధ్యక్షులుగా పొన్నీటిపాళ్యం పంచాయతీ,చిప్పిలికి చెందిన పసుపులేటి వరప్రసాద్ నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం కాపు,బలిజ జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు అమ్మ శ్రీనివాస్ నాయుడు నియామకపు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా వరప్రసాద్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పగించినందుకు ఆనందంగా ఉ ందన్నారు. నియోజకవర్గంలో కాపు,బలిజల శ్రేయస్సు,అభ్యున్నతికి శక్తి వంచన లేకుండా పనిచేస్తానని ధీమా వ్యక్తం చేశారు. నా బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తానని,తనకు ఈ బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర అధ్యక్షులు అమ్మ శ్రీనివాస్ నాయుడు,జేఏసీ ప్రముఖులకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేస్తున్నానన్నారు. అనంతరం పలువురు బలిజ,కాపు నాయకులు మాట్లాడుతూ పసుపులేటి వరప్రసాద్ సమర్థవంతమైన యువ నాయకుడు అన్నారు. ఇప్పటికే తెలుగుదేశం పార్టీ,కూటమిలో చురుకైన పాత్ర పోషిస్తున్నారన్నారు. అటువంటి వ్యక్తికి నియోజకవర్గ ఉపాధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించడం శుభపరిణామమన్నారు. ఆయన సారథ్యంలో నియోజకవర్గంలో కాపు,బలిజలు అన్నిరంగాల్లో ముందంజ వేయాలని ఆకాంక్షించారు.

# వెలుగు సెక్రటరీ ఉదయ్ మోహన్ రెడ్డి సేవలకి విశిష్ట పురస్కారం

## - ప్రతిష్టాత్మక ఆర్ట్ ఆఫ్ లివింగ్ అవార్డు ప్రదానం




మదనపల్లె (ప్రజా సీమ) : 182 దేశాలలో విస్తరించిన ది ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ స్థాపించి 45 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా అలాగే ఆర్ట్ ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకులు గురుదేవ్ శ్రీశ్రీ రవి శంకర్ 70 సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న వేళ సమాజానికి మౌనంగా సేవ చేస్తూ,సమాజంలో మార్పును తీసుకువచ్చిన నిజమైన హీరోలనుహోదేశవ్యాప్తంగాఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ గుర్తించి గౌరవిస్తోంది. ఈ నేపథ్యంలో శనివారం మదనపల్లిలోని వెలుగు సంస్థ సెక్రెటరీ ఎం. ఉదయ్ మోహన్ రెడ్డి,కడప జిల్లాలోని ఎద్దుల పెద్ద శేషమ్మ అనాధ ఆశ్రమం వ్యవస్థాపకులు ఎద్దుల నాగేంద్రలకి ఆర్ట్ ఆఫ్ లివింగ్ అవార్డులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కాణిపాకం దేవస్థానం బోర్డు మెంబర్ వాణి,బాలాజీ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ డాక్టర్ వెంకటేశ్వర రెడ్డి,ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఎపెక్స్ మెంబర్ పూనగంటి ఓం ప్రకాష్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉదయ్ మోహన్ రెడ్డి మాట్లాడుతూ ఆర్ట్ ఆఫ్ లివింగ్ అవార్డును అందుకోవడం గర్వంగా ఉందన్నారు. ప్రత్యేక ప్రతిభావంతులు,వృద్ధులకు సేవ దేవతలకు సేవ చేయడంతో సమానమన్నారు. ఈ అవార్డు తన బాధ్యతను మరింత పెంచిందన్నారు.

# కొలిమిగుండ్లలో ఉచిత మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభం

**-సొంత నిధులతో రూ. 9 లక్షల వ్యయంతో వాటర్ ప్లాంట్ ఏర్పాటు**

**- ప్రజలకు నాణ్యమైన తాగునీరు అందించడమే లక్ష్యం: మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి**

**- ప్లాంట్ నీటిని స్వయంగా రుచి చూసి నాణ్యత పరిశీలించిన మంత్రి, కలెక్టర్**

**- సేవా దృక్పథంతో చేపట్టిన కార్యక్రమం అభినందనీయం: కలెక్టర్ రాజకుమారి గణియా**

బనగానపల్లె/నంద్యాల, మే 02: ప్రజలకు నాణ్యమైన తాగునీరు అందించడమే లక్ష్యమని రోడ్లు భవనాలు, పెట్టుబడులు మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి అన్నారు. శనివారం బనగానపల్లె నియోజ కవర్గం కొలిమిగుండ్ల మండల కేంద్రంలో ప్రజలకు సురక్షితమైన తాగునీటిని అందించేం దుకు ఏర్పాటు చేసిన ఉచిత మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఆర్ అండ్ బి శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి గారితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజలకు సురక్షితమైన మరియు నాణ్యమైన తాగునీటిని అందించడమే ఈ ప్లాంట్ ఏర్పాటు లక్ష్యమని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో శుద్ధమైన నీటి కొరతను దృష్టిలో ఉంచుకుని, సేవా దృక్పథంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు మంత్రి వెల్లడించారు. ప్రారంభోత్సవం అనంతరం మంత్రి, కలెక్టర్ ఇద్దరూ స్వయంగా ప్లాంట్‌లో ఉత్పత్తి చేసిన మంచినీటిని తాగి నాణ్యతను పరిశీలించారు.

# వైభవోపేతంగా శ్రీ ప్రసన్న వెంకటరమణ స్వామి రథోత్సవం

## - అన్నప్రసాద వితరణలో పాల్గొన్న జోలపాళ్యం భవాని ప్రసాద్



మదనపల్లె (ప్రజా సీమ) : పట్టణంలో వెలసిన శ్రీ ప్రసన్న వెంకటరమణ స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం రథోత్సవం కన్నుల పండుగలా జరిగింది. ఈ నేపథ్యంలో వెంకటేశ్వర అన్నదాన కమిటి ఆధ్వర్యంలో భక్తులకు,ప్రజలకు అన్నప్రసాద వితరణ చేశారు. స్థానిక నెహ్రూ బజారులో అన్నదాన కార్యక్రమం పెద్దఎత్తున నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ జోలపాళ్యం భవాని ప్రసాద్ రథోత్సవం సందర్భంగా స్వామివారి దర్శనం కోసం వచ్చే భక్తుల ఆకలి తీర్చడానికిగాను ప్రతిఏటా అనవాయితీగా విశేష అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరుగుతోందన్నారు. రథోత్సవానికి తరలివచ్చిన భక్తులకు,పట్టణ ప్రజలకు కమిటీ సభ్యులతో కలిసి స్వయంగా అన్న ప్రసాదాన్ని పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఆధ్యాత్మిక వేడుకల్లో భాగంగా భక్తుల ఆకలి తీర్చేందుకు చేసిన ఈ కృషిని స్థానికులు,స్వామి వారి భక్తులు అభినందించారు. అన్నదాన కార్యక్రమంలో ప్రజలు,భక్తులు పాల్గొని స్వామివారి కృపకు పాత్రులై అన్నప్రసాదం స్వీక రించారు. ఈ కార్యక్రమంలో నాగరాజు,శ్రీరాములు,వెంకటా చలపతి,సూర్య నారాయణ,మౌలాలి,శ్రీనివాసులు,వెంకటరమణ మరియు శ్రీ ప్రసన్న వెంకట రమణ స్వామి వారి భక్తులు పాల్గొన్నారు.

# పది ఫలితాల్లో చరిత్ర సృష్టించిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు

## –గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము





గుడివాడ, మే 02:మన ప్రభుత్వ పాఠశాలల ఆడబిడ్డలు ఈరోజు చరిత్ర సృష్టించారని పదో తరగతి పరీక్షల్లో అద్భుత విజయం సాధించారని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము హర్షం వ్యక్తం చేశారు. విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ నిరంతర పర్యవేక్షణ, సంస్కరణలు చక్కటి ఫలితానిచ్చాయనీ ఆయన పేర్కొన్నారు. గుడివాడ నియోజకవర్గంలో ఎస్ఎస్సీ ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థినులు సత్తా చాటారు. జిల్లా టాప్ ర్యాంకర్లను శనివారం ఉదయం రాజేంద్రనగర్‌లోని తన స్వగృహంలో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అభినందించారు. 592 మార్కులతో జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల్లో ప్రథమ స్థానం సాధించిన వి. అక్షిత, 591 మార్కులతో ద్వితీయ స్థానంలో నిలిచిన షేక్ జాస్మిన్, అమృత వర్షిని, 590 మార్కులతో తృతీయ స్థానం సాధించిన ప్రణీతను ఎమ్మెల్యే రాము మిఠాయిలు తినిపించారు. మన ప్రభుత్వ పాఠశాలల ఆడబిడ్డలు ఈరోజు చరిత్ర సృష్టించారని,జిల్లా స్థాయిలో టాప్ ర్యాంకులు సాధించడం మనందరికీ గర్వకారణమనీ ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాము అన్నారు. ఈ విజయం వెనుక విద్యార్థినుల కృషి, తల్లిదండ్రుల సహకారం, ఉపాధ్యాయుల పట్టుదల ఉందన్నారు. అన్నింటికీ మించి రాష్ట్రంలో విద్యావ్యవస్థను బలోపేతం చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు,దార్శనికత, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ నిరంతర పర్యవేక్షణ, సంస్కరణలు ఉన్నాయన్నారు. మంత్రి లోకేష్ ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన, డిజిటల్ క్లాస్ రూమ్‌లు, ఉపాధ్యాయులకు శిక్షణ, విద్యార్థులకు నాణ్యమైన బోధన అందేలా తీసుకుంటున్న చర్యల ఫలితమే ఈరోజు మన కళ్ల ముందు కనిపిస్తోందనీ,ఆయనకు నా తరపున, నియోజకవర్గ ప్రజల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు చెప్తున్నాను అన్నారు. అక్షిత, జాస్మిన్, అమృత, ప్రణీత మీరు నలుగురూ మిగతా విద్యార్థులకు స్ఫూర్తిగా నిలుస్తూ బాగా చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించిన ఎమ్మెల్యే రాము,మీ చదువుకు, మీ భవిష్యత్తుకు నా సంపూర్ణ సహకారం ఎప్పుడూ ఉంటుందనీ,ఏ అవసరం వచ్చినా నేరుగా నన్ను కలవచ్చు అన్నారు. అయితే కొన్ని పాఠశాలల్లో ఉత్తీర్ణత శాతం తక్కువగా ఉ ండటం బాధాకరమని,దీనిపై విద్యాశాఖ అధికారులతో మాట్లాడి, ఎక్కడ లోపం జరిగిందో సమీక్షించి, వచ్చే ఏడాది 100% ఫలితాలు వచ్చేలా ప్రణాళికతో ముందుకు వెళ్తామన్నారు. ప్రభుత్వ బడి అంటే తక్కువ కాదు అని మన పిల్లలు నిరూపించారనీ, ఈ స్ఫూర్తిని కొనసాగిద్దామన్న ఎమ్మెల్యే రాము విద్యార్థులందరికీ మరోసారి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు,విద్యాశాఖ అధికారులు బాలాజీ, డేవిడ్ పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఆహారం వృథా చేయకండి అన్నార్తులను ఆదుకోండి

## జన చైతన్య సమితి కార్యదర్శి సాంబశివరావు



(ప్రజా సీమ)పెద్దకూరపాడు,మే 2: ఆహారం వృథా చేయకుండా అన్నార్తులను ఆదుకోవాలని జన చైతన్య సమితి స్వచ్ఛంద సంస్థ కార్యదర్శి,కోలాటం మాస్టారు తుళ్లూరి సాంబశివరావు అన్నారు. నియోజకవర్గ కేంద్రమైన పెదకూరపాడుకు చెందిన మండల పరిషత్ అధ్యక్షులు బెల్లంకొండ మీరయ్య మాతృమూర్తి సీతామహాలక్ష్మి పెద్దకర్మ శనివారం జరిగింది. ఈసందర్భంగా భోజనం మిగిలిన విషయాన్ని జన చైతన్య సమితి కార్యదర్శి తుల్లూరి సాంబశివరావుకు వారి బంధువు కర్ణం శ్రీను శబ్దం ద్వారా తెలపడంతో జన చైతన్య సమితి స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు మిగిలిన భోజనాన్ని సేకరించి మండలంలోని 75 తాళ్లూరు శాంతి కాలనీలోఅ పంపిణీ చేశారు. ఈసందర్భంగా సాంబశివరావు మాట్లాడుతూ పేదవారి ఆకలి తీర్చడం గొప్ప పుణ్యం మని,ఆహారం వృథా చేయకుండా పేదలకు పెట్టడం తమకెంతో ఆనందంగా ఉందన్నారు. ప్రతి ఒక్కరు రోజంతా శ్రమించేది అన్నం కోసమేనని ఫంక్షన్ ఏదైనా ఆహారం మిగిలి ఉంటే తమకు సమాచారం అందిస్తే అన్నాన్ని వృథా చేయకుండా మిగిలి ఉంటే 9885557987,8886777767 ఫోన్ నెంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు. జన చైతన్య సమితి వ్యవస్థాపక అధ్యక్షులు దాసరి విజయ్ బెన్నిబాబు మాట్లాడుతు సృష్టిలో అన్నదానానికి మించిన దానం లేదని, ప్రతి ఒక్కరు రోజంతా శ్రమించేది అన్నం కోసమేనని అన్నారు. ఈకార్యక్రమంలో జనచైతన్య సమితి ప్రతినిధులు మన్నవ బాల శ్రీహర్ష,ఆనమాల గోపీచంద్, షేక్ ఇస్మాయిల్,షేక్ మస్తాన్ వలి,కిన్నెర అంజయ్య,గంధం వీర్లంక తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా 200 మందికి అన్నదానాన్ని నిర్వహించారు.

# అన్న క్యాంటీన్‌లో అన్నప్రసాద వితరణ చేసిన ఎమ్మెల్యే తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య)

జగ్గయ్యపేట: మే 2(ప్రజా సీమ): జగ్గయ్యపేట పట్టణంలోని కమల సెంటర్‌లో ఉన్న అన్న క్యాంటీన్‌లో, జగ్గయ్యపేట పట్టణానికి చెందిన ఈమన శ్రీనివాసరావు తమ తండ్రి స్వర్గీయ ఈమన వీర రాఘవులు జ్ఞాపకార్థం అన్న క్యాంటీన్‌కు ఒక రోజు అన్నదాన కార్యక్రమాన్ని స్పాన్సర్ చేశారు. ఈకార్యక్రమంలో ఎమ్మెల్యే తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) పాల్గొని, ప్రజలకు స్వయంగా అన్నప్రసాదాన్ని వితరణ చేశారు. ఈ సందర్భంగా తాతయ్య మాట్లాడుతూ పేదల ఆకలి తీర్చే అన్న క్యాంటీన్లు ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా నిలుస్తున్నాయని, ఇలాంటి సేవా కార్యక్రమాలకు ముందుకు వచ్చే దాతలను అభినందించారు.

PRGI Regd. No : APTEL/26/A0819
నేటిపత్రిక ప్రజాసీమ జాతీయ తెలుగుదినపత్రిక



# ఆరోగ్యం



## సమ్మర్ వచ్చేసిందని 'మజ్జిగ' తెగ తాగేస్తున్నారా? ఐతే డేంజరే!

ఎండాకాలం ప్రారంభం కాకముందు నుంచే ఎండలు మండిపోతున్నాయి. ప్రస్తుతం ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో ఉదయం నుంచే భానుడి భగభగలతో జనం అల్లాడిపోతున్నారు. మండే వేడి నుంచి తప్పించుకోడానికి చాలా మంది చల్లగా ఉండే ఏదైనా తినడానికి లేదా తాగడానికి ఇంట్రెస్ట్ చూపిస్తుంటారు. మజ్జిగ ప్రోటీన్, కాల్షియం, విటమిన్లు %ూా, ఋ% యొక్క అద్భుతమైన మూలం. ఇందులో కాల్షియం, విటమిన్ బి12, జింక్, రిబోఫ్లేవిన్, ప్రోటీన్లు పుష్కలంగా ఉన్నాయి. చాలామంది ఎండాకాలంలో మజ్జిగ తాగడం మంచిదని ఎక్కువగా తాగుతుంటారు. అయితే మజ్జిగ తాగడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉండటంతో పాటు కొన్ని దుష్ప్రభావాలు కూడా ఉంటాయని నిపుణులు చెబుతున్నారు.

మజ్జిగ ఆరోగ్య ప్రయోజనాలు –మజ్జిగ వల్ల లెక్కలేనన్ని ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. వాటిలో కొన్నింటిని ఇప్పుడు చూద్దాం.

–కడుపు సమస్యలు ఉన్నవారు అల్పాహారంగా మజ్జిగ తాగవచ్చు. ఉదయం ఖాళీ కడుపుతో మజ్జిగ తాగడం వల్ల మలబద్ధకం, అజీర్ణం, గ్యాస్ వంటి కడుపు సమస్యలు తొలగిపోతాయి. –మజ్జిగ ద్వారా లభించే విటమిన్ ఏ మీ కంటి చూపును బలంగా ఉంచడంలో సహాయపడుతుంది. ఇది రోగనిరోధక శక్తిని కూడా పెంచుతుంది. గుండె, ఊపిరితిత్తులు, మూత్రపిండాలు వంటి అంతర్గత అవయవాలను ఆరోగ్యంగా ఉంచుతుంది.

–మజ్జిగను చిలికిన తర్వాత అందులో మిగిలిపోయిన బ్యాక్టీరియా లాక్టోస్‌ను లాక్టిక్ ఆమ్లంగా మార్చడానికి సహాయపడుతుంది.. దీనివల్ల లాక్టోస్ అసహనం ఉన్నవారు దానిని జీర్ణం చేసుకోవడం సులభం అవుతుంది. –మజ్జిగ రిబోఫ్లేవిన్ ద్వారా శక్తిని ఉత్పత్తి చేస్తుంది. ఇది అమైనో ఆమ్లాలను నియంత్రించడంలో కూడా సహాయపడుతుంది. శరీరానికి అవసరమైన ప్రోటీన్లను తయారు చేయడానికి అమైనో ఆమ్లాలు ముఖ్యమైనవి.

## ప్రపంచంలో ఎక్కడా దొరకని బ్రేక్ ఫాస్ట్ ఇది..

**మీరు ఇప్పటి వరకు ఎన్నో రకాల బ్రేక్ ఫాస్ట్‌లు టిఫిన్‌లు తిని ఉంటారు. కానీ ఎప్పుడైనా హైదరాబాద్ సాంప్రదాయక వంటకమైన, హైదరాబాద్‌లోనే దొరికే ఖిచిడీ ఖీమా ఖట్ట తిన్నారా? దీని రుచి మాటల్లో వర్ణించలేము. తెల్లవారు జామున 4 గంటలకు లేచి మరీ దీనిని తినడానికి లైన్లో నిలబడే వారు చాలా మంది ఉంటారు. అయితే ఈ రోజు ఈ ఖిచిడీ ఖీమా ఖట్టను ఎలా చేసుకోవాలి దానికి కావాల్సిన పదార్థాలు ఏంటి అనేది తెలుసుకుందాం.**

ఖిచిడీ కోసం కావలసినవి: బియ్యం – 1 కప్పు పెసర పప్పు – 1/2 కప్పు ఉల్లిపాయ – 1 పచ్చిమిర్చి – 2 అల్లం వెల్లుల్లి పేస్ట్ – 1 టీస్పూన్ నెయ్యి – 2 టేబుల్ స్పూన్లు జీలకర్ర – 1/2 టీస్పూన్ లవంగాలు – 2 యాలకులు – 2

దాల్చిన చెక్క – చిన్న ముక్క నీరు – 3 కప్పులు ఉప్పు – రుచికి సరిపడా .

ఖీమా కోసం కావలసినవి: మటన్ ఖీమా – 1/2 కిలో ఉల్లిపాయ – 2 (పెద్దవి, తరిగినవి) పచ్చిమిర్చి – 4 అల్లం వెల్లుల్లి పేస్ట్ – 2 టీస్పూన్లు టమాటా – 1 కారం పొడి – 2 టీస్పూన్లు ధనియాల పొడి – 1 టీస్పూన్ జీలకర్ర పొడి – 1/2 టీస్పూన్ గరం మసాలా – 1/2 టీస్పూన్ నూనె – 3 టేబుల్ స్పూన్లు ఉప్పు – రుచికి సరిపడా కొత్తిమీర – కొద్దిగా (తరిగినది)

ఖట్టా కోసం కావలసినవి: చింతపండు – 1/2 కప్పు (పులుసు తీసినది) ఉల్లిపాయ – 1 పచ్చిమిర్చి – 2 కరివేపాకు – కొద్దిగా ఆవాలు – 1/2 టీస్పూన్ జీలకర్ర – 1/2 టీస్పూన్ ఎండుమిర్చి – 2 నూనె – 2 టేబుల్ స్పూన్లు ఉప్పు – రుచికి సరిపడా ఖిచిడీ తయారీ విధానం:

ఖిచిడీ తయారు చేయడానికి ముందుగా బియ్యం, పెసర పప్పును



కడిగి, నీటిలో నానబెట్టాలి. ఆ తరువాత కుక్కర్లో నెయ్యి వేడి చేసి అందులో జీలకర్ర, లవంగాలు, యాలకులు మరియు దాల్చిన చెక్క వేసి వేయించాలి. అనంతరం ఉల్లిపాయ మరియు పచ్చిమిర్చి వేసి బంగారు రంగు వచ్చేవరకు వేయించాలి. అలాగే అల్లం వెల్లుల్లి పేస్ట్ వేసి ఒక నిమిషం వేయించాలి. తరువాత నానబెట్టిన బియ్యం మరియు పెసర పప్పు వేసి రెండు నిమిషాలు వేయించాలి. ఆపై నీరు మరియు ఉప్పు వేసి బాగా కలపాలి. తరువాత కుక్కర్ మూత పెట్టి, రెండు విజిల్స్ వచ్చేవరకు ఉడికించాలి.

తెలుగు వంటలు

ఖీమా తయారీ విధానం కుక్కర్లో నూనె వేడి చేసి, ఉల్లిపాయ మరియు పచ్చిమిర్చి వేసి బంగారు రంగు వచ్చేవరకు వేయించాలి. ఆ తరువాత అందులో అల్లం వెల్లుల్లి పేస్ట్ వేసి ఒక నిమిషం వేయించాలి. ఇప్పుడు అందులో ఖీమా వేసుకోవాలి. ఆ ఖీమా రంగు మారే వరకు వేయించాలి. అనంతరం టమాటా, కారం పొడి, ధనియాల పొడి, జీలకర్ర పొడి మరియు ఉప్పు వేసి బాగా కలపాలి. కొద్దిగా నీరు వేసి కుక్కర్ మూత పెట్టి, రెండు విజిల్స్ వచ్చేవరకు ఉడికించాలి. ఆ తరువాత గరం మసాలా మరియు కొత్తిమీర వేసి కలపాలి.

## ఎండాకాలంలో కడుపు చల్లగా.. పంజాబీ స్టైల్ లో లస్సీ ఇలా చేసుకోండి



ఎండాకాలం వచ్చేసింది. అప్పుడే భానుడి భగభగలు మొదలయ్యాయి. ఇప్పుడే ఇలా ఉంటే ఇక ఏప్రిల్, మే నెలల్లో భానుడు తన విశ్వరూపాన్ని చూపిస్తాడు. అయితే సమ్మర్ లో మండే వేడి నుంచి తప్పించుకోడానికి చాలామంది కూల్ డ్రింక్ లు తాగుతుంటారు. అయితే ఏది పడితే అది తాగి ఆరోగ్యం చెడగొట్టుకోవడం కన్నా ఆరోగ్యకమైన డ్రింక్ లు తీసుకోడం బెస్ట్.

సమ్మర్ లో చాలామంది తీసుకునే డ్రింక్ లలో లస్సీ కూడా ఉంటుంది. దీని వల్ల శరీరానికి చాలా ప్రయోజనాలు కూడా ఉంటాయి. అయితే పంజాబ్ లో ఈ లస్సీ చాలా ప్రత్యేకంగా చేస్తుంటారు. మీరు కూడా మీ ఇంట్లో పంజాబీ స్టైల్ లస్సీ తయారుచేసుకోవాలనుంటే ఎలాగో ఇక్కడ చూడండి.

పంజాబీ స్టైల్ లస్సీ తయారీకి కావీల్సిన పదార్థాలు –పెరుగు –చక్కెర –పిస్తా తరుగు –పాలకోవా –కుంకుమ పువ్వు –యాలకల పొడి –ఐస్ వాటర్ పంజాబీ స్టైల్ లస్సీ తయారీ విధానం –ముందుగా ఓ బౌల్ తీసుకొని అందలో చిక్కటి మీగడతో ఉన్న 400 గ్రాముల పెరుగు వేయండి.

–దీనిని 4 నిమిషాల పాటు బాగా చిలుక్కోవాలి(బ్లెండ్ చేసుకోవాలి) –తర్వాత ఇందులో ఐదారు చెంచాలా చక్కెర, అర చెంచా యాలకల పొడి వేసి మళ్లీ 2 నిమిషాలు చిలుక్కోవాలి(బ్లెండ్ చేయాలి). –తర్వాత ఇందులో బాగా చల్లగా ఉండే అరకప్పు ఐస్ వాటర్ పోసి మళ్లీ రెండు నిమిషాలు బ్లెండ్ చేసుకోండి. అప్పుడు వెన్న మొత్తం పైకి తేలుతుంది. ఇప్పుడు ఈ లస్సీని తాగే గ్లాసులో పోసుకొని ఇందులో కొంచెం పిస్తా తరుగు, ఫ్రెష్ బటర్, కొంచెం పాలకోవా,కొంచెం కుంకుమ పువ్వు వేయండి. అంతే పంజాబీ స్టైల్ లస్సీ రెడీ.

## ఎండాకాలం కడుపులో చల్లగా ఉండాలంటే తప్పనిసరిగా ఇది తినాల్సిందే, ఎలా చేసుకోవాలంటే?



ఎండాకాలం మొదలైంది. ప్రజలందరూ చల్లగా కడుపులో వేసుకోవాలని ఐస్ క్రీమ్స్, కూల్ డ్రింక్స్ తాగడం మొదలుపెట్టేశారు. అయితే మండే ఎండలో చాలా మంది ఇష్టంగా తినే వంటకం ఏదైనా ఉందంటే అది మలాయ్ కుల్ఫీ. ఎక్కడున్నా మరి దానికోసం వెళ్లి తింటూ ఉంటారు. ఇది చాలా రుచికరంగా ఉంటుంది. దీంతో దీనిని తినేందుకు చాలా మంది ఇష్టపడుతుంటారు. అయితే ఈ మలాయ్ కుల్ఫీని ఇంట్లోనే ఎలా చేసుకోవాలి? దానికి కావాల్సిన పదార్థాలు ఏంటి అనేది ఈ స్టోరీలో తెలుసుకుందాం.


మలాయ్ కుల్ఫీ తయారీకి కావాల్సిన పదార్థాలు 1 లీటరు పాలు 1/2 కప్పు చక్కెర 1/4 కప్పు పాలు పొడి (మిల్క్ పౌడర్) 1/4 కప్పు తాజా క్రీమ్ 1/4 టీస్పూన్ యాలకుల పొడి కొన్ని పిస్తా మరియు బాదం పలుకులు (గార్నిష్ కోసం)

తయారీ విధానం ముందుగా, పాలను ఒక మందపాటి గిన్నెలో పోసి సగం అయ్యే వరకు మరిగించండి. ఇది సుమారు 20–25 నిమిషాలు పడుతుంది. పాలు చిక్కబడ్డాక, చక్కెర వేసి, అది కరిగే వరకు కలపండి. వేరే గిన్నెలో పాలు పొడి మరియు తాజా క్రీమ్‌ను బాగా కలిపి ఉండలు లేకుండా చేయండి. ఈ మిశ్రమాన్ని మరిగించిన పాలలో వేసి బాగా కలపండి. ఆ తరువాత అందులో యాలకుల పొడి వేసి బాగా కలపండి. ఆ తర్వాత స్టవ్ ఆఫ్ చేసి మిశ్రమాన్ని చల్లారనివ్వండి. మిశ్రమం పూర్తిగా చల్లారాక, కుల్ఫీ మోల్డ్స్‌లో లేదా చిన్న కప్పులలో పోయండి. పైన పిస్తా మరియు బాదం పలుకులతో గార్నిష్ చేయండి. మోల్డ్స్‌ను అల్యూమినియం ఫాయిల్‌తో కప్పి, ఫ్రీజర్‌లో కనీసం 6–8 గంటలు లేదా రాత్రంతా గడ్డ కట్టే వరకు ఉంచండి. కుల్ఫీ గడ్డ కట్టాక, వాటిని ఫ్రీజర్ నుండి బయటకు తీసి, కొద్దిసేపు నీటిలో ఉంచండి. తర్వాత మోల్డ్స్ నుండి కుల్ఫీని సులభంగా బయటకు తీయవచ్చు. ఆ తరువాత వాటిని ఆస్వాదించడమే.

ప్రజాసీమ
PRGI Regd. No : APTEL/26/A0819



# సినిమా న్యూస్



ప్రస్తుతం దక్షిణాది చిత్ర పరిశ్రమలో కన్నడ భామల హవా నడుస్తోంది. నేషనల్ క్రష్ రష్మిక మందన్నా, లేటెస్ట్ సెన్సేషన్ రుక్మిణి వసంత్ తమకంటూ ప్రత్యేక గుర్తింపును సంపాదించుకున్నారు. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే? ఇద్దరు కన్నడ అందగత్తెలు సినిమాల ఎంపిక విషయంలో దాదాపు ఒకే విధమైన సూత్రాలను పాటిస్తున్నారు. గ్లామర్ పాత్రలకే పరిమితం కాకుండా నటనకు ప్రాధాన్యత ఉన్న కథలను ఎంచుకోవడంలో ఇద్దరు ఒకే ఆలోచనతో ముందుకు సాగుతున్నారు. రష్మిక మందన్నా కెరీర్ ప్రారంభం నుండి చూస్తే? స్టార్ హీరోల కే పరిమితం కాకుండా పాత్రకు ప్రాముఖ్యత ఉన్న చిత్రాలను ఎంచుకుంటూ వచ్చింది. -కిరాక్ పార్టీ-తో మొదలైన అమ్మడి ప్రయాణం -పుష్ప-, -యానిమల్- వంటి భారీ చిత్రాల వరకు చేరింది. అయితే రష్మిక పాత్రలో వైవిధ్యం ఉంటేనే సినిమాకు గ్రీన్ సిగ్నల్ ఇస్తుంది. రెండు పాటలు, మూడు సీన్ల కోసం సినిమాలు చేయనని గతంలోనే స్పష్టం చేసింది. ఈ క్లారిటీనే ఆమెను నేడు పాన్-ఇండియా స్టార్‌గా నిలబెట్టింది. ముందుగా కథ, ఆ తర్వాత పాత్ర లోతును పూర్తిగా స్టడీ చేసిన తర్వాతే ఏ సినిమాకైనా సైన్ చేస్తుంది. అలాగే -కాంతార2- తో సౌత్ లో ఫేమస్ అయిన రుక్మిణి వసంత్ కూడా ఇదే బాటలో పయనిస్తోంది. ఆమెకు టాలీవుడ్‌లో వరుస ఆఫర్లు వస్తున్నా? ఆచితూచి అడుగులు వేస్తోంది.

## కథల ఎంపికలో కన్నడ భామలిద్దరు ఒకేలా!

తాజాగా రవితేజ సరసన ఓ ప్రాజెక్ట్‌కు సంతకం చేసినట్లు వార్తలొస్తున్నాయి. ఆమె ప్రధానంగా కథా బలమున్న చిత్రాలకే మొగ్గు చూపుతోంది. బలమైన పాత్రకాకపోతే ఎంత రెమ్యునరేషన్ ఆఫర్ చేసినా? నో చెప్పడానికి రుక్మిణి వెనుకాడటం లేదని ఇండస్ట్రీ టాక్. ఎన్టీఆర్ సరసన -డ్రాగన్- లో నటిస్తున్నా? ఆ సినిమాలో అమ్మడి పాత్రకు ప్రాధాన్యత ఉందని తెలిసింది. ఇద్దరు భామల ఎంపికల్లో కనిపిస్తోన్న మరో పాయింట్ ఎమోషనల్ కనెక్ట్. ప్రేక్షకులు తమ పాత్రతో కనెక్ట్ అయ్యేలా ఉండే కథలనే ఎక్కువగా ఇష్ట పడుతున్నారు. రష్మిక శ్రీవల్లిగా ఎంతగా మాస్ ఆడియన్స్‌ను మెప్పించిందో? -గీత గోవిందం-లో అంత క్లాస్ లుక్‌లో అలరించింది. రుక్మిణి కూడా సహజసిద్ధమైన నటనతో హోమ్లీ ఇమేజ్‌ను కాపాడుకుంటూనే? నవతరం ప్రేక్షకులకు నచ్చే పాత్రలను ఎంచుకుంటోంది. కథ వినేటప్పుడే పాత్ర గ్రాఫ్ ఎలా ఉందో క్షుణ్ణంగా పరిశీలించడం ఇద్దరిలో మరో కామన్ పాయింట్. ప్రస్తుతం పరిశ్రమలో పోటీని తట్టుకుని నిలబడాలంటే అందం మాత్రమే సరిపోదని సరైన కథలను ఎంచుకునే విజ్ఞత ఉండాలని ఇరువురు బలంగా నమ్ముతున్నారు. రష్మిక తెలుగు సినిమాలతో హిందీ చిత్రాల్లోనూ నటిస్తోన్న సంగతి తెలిసిందే. కమర్షియల్ కథలతో పాటు లేడీ ఓరియేంటెడ్ కథలను ఒకే చేస్తూ ముందుకెళ్తుంది. రుక్మిణి వసంత్ కన్నడతో పాటు తమిళ, తెలుగు చిత్రాల్లో తన ముద్ర వేయడానికి సిద్ధమవుతోంది. ఇద్దరి కెరీర్ గ్రాఫ్ చూస్తుంటే? పక్కా ప్లానింగ్‌తో లాంగ్ రన్ ఉండాలనే లక్ష్యంతో కొన్ని రూల్స్ పెట్టుకునే ముందు కెళ్తున్నట్లు కనిపిస్తోంది.



## -సతీ లీలావతి- అన్ని వర్గాలకు వినోదం పంచే సినిమా



మెగా కోడలు లావణ్య త్రిపాఠి కొణిదెల - దేవ్ మోహన్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం -సతీ లీలావతి- మే 8న ప్రపంచవ్యాప్తంగా విడుదలకు సిద్ధమవుతోంది. ప్రముఖ నిర్మాణ సంస్థ ఆనంది ఆర్ట్స్ సమర్పణలో, దుర్గాదేవి పిక్చర్స్ బ్యానర్‌పై నాగమోహన్ ఈ చిత్రాన్ని నిర్మించారు. 'భీమిలీ కబడ్డీ జట్టు', 'ఎస్ఎంఎస్' వంటి చిత్రాలతో తనకంటూ ఒక ప్రత్యేకమైన శైలిని ఏర్పరచుకున్న తాతినేని సత్య ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు. శనివారం జరిగిన వేడుకలో మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ ఈ మూవీ ట్రైలర్‌ను లాంచ్ చేసి చిత్ర యూనిట్‌కు అండగా నిలిచారు. ఈ సందర్భంగా నిర్మాత నాగమోహన్ మాట్లాడుతూ.. -సతీ లీలావతి- అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునే కంటెంట్‌తో రూపొందిందని ధీమా వ్యక్తం చేశారు. షూటింగ్ ప్రారంభం నుండి ప్రమోషన్ల వరకు సహకరించిన నటీనటులకు, సాంకేతిక నిపుణులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యంగా లావణ్య త్రిపాఠి, దేవ్ మోహన్ అందించిన సహకారం వల్లనే సినిమాను అనుకున్న సమయానికి, అత్యున్నత నాణ్యతతో ప్రేక్షకుల ముందుకు తీసుకురాగలిగామని ఆయన పేర్కొన్నారు. రామ్ చరణ్ ట్రైలర్‌ను రిలీజ్ చేయడం సినిమా స్థాయిని పెంచిందని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. అన్ని వర్గాలకు వినోదం పంచే సినిమా ఇదని తెలిపారు.

దర్శకుడు తాతినేని సత్య మాట్లాడుతూ.. రామ్ చరణ్ ప్రోత్సాహానికి కృతజ్ఞతలు తెలిపారు. రైటింగ్ విభాగంలో ఉదయ్ అందించిన సహకారం, అలాగే డైరెక్షన్ టీం పడ్డ కష్టం తెరపై స్పష్టంగా కనిపిస్తుందని ఆయన అన్నారు. మే 8న థియేటర్లకు వచ్చే ప్రేక్షకులకు ఈ సినిమా ఒక మంచి అనుభూతిని ఇస్తుందని, ప్రతి ఒక్కరూ ఈ చిత్రాన్ని చూసి ఆశీర్వదించాలని కోరారు. 'సతీ లీలావతి' చిత్రంలో హాస్యం, భావోద్వేగాలు సమపాళ్లలో ఉంటాయని ఆయన వివరించారు. చిత్ర కథానాయకుడు దేవ్ మోహన్ మాట్లాడుతూ,.. తెలుగు ప్రేక్షకుల ముందుకు మళ్ళీ రావడం ఆనందంగా ఉందన్నారు. ఈ సినిమాలో తాను పోషించిన పాత్ర చాలా వైవిధ్యంగా, కొత్తగా ఉంటుందని వెల్లడించారు. లావణ్య త్రిపాఠితో కలిసి నటించడం ఒక గొప్ప అనుభవమని, ట్రైలర్‌కు వస్తున్న స్పందన చూస్తుంటే సినిమా విజయంపై నమ్మకం పెరిగిందని ఆయన పేర్కొన్నారు. ఈ అవకాశం కల్పించిన దర్శక నిర్మాతలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. రామ్ చరణ్ ఈ చిత్రానికి పూర్తి స్థాయిలో మద్దతు తెలుపుతూ, లావణ్య త్రిపాఠి నటనలో చాలా సహజంగా కామెడీ పండించిందని ప్రశంసించడం విశేషం. మరోవైపు ఈ చిత్రాన్ని పవర్ స్టార్ పవన్ కల్యాణ్ కోసం ప్రత్యేకంగా ఒక ఫ్యామిలీ షో వేయాలని ప్లాన్ చేస్తున్నట్లు లావణ్య త్రిపాఠి ప్రకటించారు. మెగా కుటుంబ సభ్యుల అండదండలతో వస్తున్న -సతీ లీలావతి- బాక్సాఫీస్ వద్ద ఏ స్థాయి వినోదాన్ని పంచుతుందో చూడాలి.

## సల్మాన్ ఖాన్ తో సమంతకు ఛాన్స్!





సల్మాన్ ఖాన్ - సమంత ఒకే ఫ్రేమ్ లో కనిపిస్తే ఎలా ఉంటుంది? ఈ ఊహే ఇప్పుడు సోషల్ మీడియాలో ఒక్కసారిగా అంచనాలను పెంచేస్తోంది. సల్మాన్ ఖాన్ కథానాయకుడిగా రాజ్ అండ్ డీకే ఓ సూపర్ హీరో చిత్రాన్ని ప్లాన్ చేస్తు న్నారు. ఇప్పటికే కథ వినిపించగా? సల్మాన్ ఒకే చేసారు. అయితే ఆ కథలో కొన్ని మార్పులను సూచించారు. వాటన్నింటి పూర్తి చేసి పట్టాలెక్కించాలని దర్శకద్వయం ప్లాన్ చేస్తోంది. ఈ క్రేజీ ప్రాజెక్ట్‌లో కథానాయికగా సమంతను ఎంపిక చేసే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని సినీ వర్గాల్లో చర్చ నడుస్తోంది.

ఇదే నిజమైతే? సమంతకు బాలీవుడ్‌లో బిగ్గెస్ట్ ఎంట్రీ ఇదే అవుతుందనడంలో ఎలాంటి సందేహం లేదు. సమంతకు, రాజ్ అండ్ డీకేలకు మధ్య మంచి అనుబంధం ఉంది. వీరి దర్శకత్వంలో రిలీజ్ అయిన -ది ఫ్యామిలీ మ్యాన్ 2- వెబ్ సిరీస్‌తో సమంత నేషనల్ వైడ్‌గా గుర్తింపు తెచ్చుకుంది. -రాజీ- పాత్రలో సమంత నటనకు బాలీవుడ్ ప్రేక్షకులు ఫిదా అయ్యారు. అటుపై వీరితోనే కలిసి -సిటాడెల్: హనీ బన్నీ- అనే మర భారీ సిరీస్‌లో నటించిన సంగతి తెలిసిందే. సమంతలోని నటన, డెడికేషన్ దర్శక ద్వయానికి బాగా నచ్చింది.

ఈ నేపథ్యంలో సమంత -రాజ్ నిడిమోరు తో మరింత స్నేహాన్ని కొనసాగించి పెళ్లి వరకూ తీసుకెళ్లింది. ఇటీవలే వాళ్లిద్దరు పెళ్లి చేసుకున్న సంగతి తెలిసిందే. దీంతో సమంతను కాదని రాజ్ నిడిమోరు మరో నాయిక వైపు ఎలా చూస్తాడు? సమంత బాలీవుడ్ లో సినిమాల్లో నటించాలని ఎప్పటి నుంచో ఆశపడుతోంది. ఎన్నో ప్రయత్నాలు కూడా చేసింది. కానీ ఎవరు అవకాశం ఇవ్వలేదు. సమంత కంటే వెనకెళ్లిన వాళ్లకు అవకాశాలు వచ్చాయిగానీ సామ్ కి మాత్రం ఛాన్స్ రాలేదు. ఈనేపథ్యంలో భర్త డైరెక్ట్ చేసే సినిమాలోనైనా సామ్ ఛాన్స్ అందుకోకపోతే ఎలా అన్న చర్చ జోరుగా సాగుతోంది. సినిమాల్లో హీరోయిన్ల పాత్రలు గ్లామర్‌కే పరిమితం కాకుండా ప్రాధాన్యత ఉండేలా రాజ్ అండ్ డీకే కథను సిద్ధం చేస్తుంటారు. సమంతకు బాలీవుడ్‌లో బాలీవుడ్ లో ఇప్పుడిప్పుడే మొదలైన క్రేజ్ నేపథ్యంలో సల్మాన్ లాంటి సూపర్ స్టార్‌తో స్క్రీన్ షేర్ చేసుకోవడం సామ్ కెరీర్‌ను మరో స్థాయికి తీసుకెళ్తుంది. సౌత్ భామలు హిందీలో జెండా పాతేస్తున్న సమయంలో సమంత-సల్మాన్ కాంబో ట్రేడ్ వర్గాల్లో కూడా హాట్ టాపిక్‌గా మారనుంది. ఈ ప్రాజెక్ట్ గనుక పట్టాలెక్కితే ప్రేక్షకులకు అద్భుతమైన విజువల్ ట్రీట్ దక్కినట్లే. రాజ్ అండ్ డీకే స్టైల్ స్టోరీ టెల్లింగ్‌లో సల్మాన్ స్వాగ్, సమంత పర్ఫార్మెన్స్ చూడాలని అభిమానులు అంతే ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

## ఎలక్షన్స్ రిజల్ట్స్ వేళ త్రిష ఊహించని పోస్ట్!



దక్షిణాది చిత్ర పరిశ్రమలో ఎవర్ గ్రీన్ బ్యూటీగా వెలిగిపోతున్న త్రిష, తాజాగా సోషల్ మీడియాలో చేసిన ఒక పోస్ట్ నెట్టింట తెగ వైరల్ అవుతోంది. తమిళనాడు ఎలక్షన్ రిజల్ట్స్ హడావిడి ఒకవైపు, త్రిష పుట్టిన రోజు వేడుకలు మరోవైపు ఉండటంతో అభిమానుల్లో జోష్ నెలకొంది. ఇన్‌స్టాగ్రామ్ లో ఆమె పెట్టిన క్యాప్షన్ ఇప్పుడు అందరినీ ఆకట్టుకుంటోంది. అసలు త్రిష ఈ పోస్ట్ వెనుక ఉన్న అంతరార్థం ఏంటి? ఆమె అప్ కమింగ్ సినిమాలు ఏంటో ఇప్పుడు చూద్దాం. సాధారణంగా మే నెల వచ్చిందంటే ఎండల వేడి గుర్తొస్తుంది. కానీ త్రిషకు మాత్రం ఇది తన సొంత సీజన్. మే 4వ తేదీన త్రిష పుట్టినరోజు కావడంతో, తన బర్త్ డే సెలబ్రేషన్స్ మొదలయ్యాయని చెబుతూ చాలా తెలివిగా "మీఎ(ఎవ)" అని పోస్ట్ చేశారు. అంటే మే నెల మరియు తనను (వీవ) కలిపి ఈ క్యాప్షన్ ఇచ్చారు. బ్లాక్ స్లీవ్‌లెస్ టాప్, జీన్స్‌లో త్రిష కనిపిస్తున్న ఈ స్టైలిష్ లుక్ చూసి ఫ్యాన్స్ ఫిదా అయిపోతున్నారు. త్రిష సినిమాల విషయానికి వస్తే, చాలా కాలం తర్వాత సూర్యతో కలిసి ఆమె నటించిన 'కరుప్పు' చిత్రం మే 14న విడుదలకు సిద్ధమవుతోంది. తెలుగులో ఈ సినిమా 'వీరభద్రుడు' పేరుతో వస్తోంది. తాజాగా ఈ సినిమా నుండి త్రిష పోషిస్తున్న 'ప్రీతి' పాత్రకు సంబంధించిన గ్లింప్స్‌ను విడుదల చేశారు. ఇక ఇందులో ఆమెలాయర్ కోటు వేసుకుని చాలాగంభీరంగా,చీరకట్టులో ఎంతో పద్ధతిగా కనిపిస్తూ ప్రేక్షకుల్లో అంచనాలు పెంచేసింది. సూర్య, త్రిష జంట అంటే సినీ ప్రేమికులకు ఒక ప్రత్యేకమైన క్రేజ్. దాదాపు 20 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత ఆర్‌జే బాలాజీ దర్శకత్వంలో వీరు మళ్లీ కలిసి నటిస్తుండటంతో 'వీరభద్రుడు' సినిమాపై భారీ హైప్ క్రియేట్ అయ్యింది. ఈ సినిమాతో పాటు త్రిష చేతిలో మరిన్ని సెన్సేషనల్ ప్రాజెక్టులు ఉన్నాయి.

Published BY B Ramasubba Reddy, PRINTED AT VSAR PUBLICATIONS, DOOR NO. 41/1077, SANKARAPURAM, KADAPA, YSR Kadapa District, ANDHRA PRADESH-516002, PUBLISHED AT 41/1077, SANKARAPURAM, KADAPA, YSR Kadapa District, ANDHRA PRADESH-516002 EDITOR: B Ramasubba Reddy, RNI NO: APTEL/26/A0819, Cell: 9515583664 Email: svscollegerjpt@gmail.com. Owner: Vasantha Lakshmi Narasamma